తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
ఆదివారం
1 మార్చి, 2026



# అడవిని పెంచుదాం ..
# సమతను పంచుదాం



# కీలక పాత్రలో రానా

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, కోలీవుడ్ డైరెక్టర్ అట్లీ కాంబినేషన్‌లో సైన్స్ ఫిక్షన్ సినిమా రాబోతోంది. ఇది అల్లు అర్జున్‌కి 22వ సినిమా. సన్ పిక్చర్స్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ ఫిల్మ్ షూటింగ్ దశలో ఉంది.

ఈ సినిమాకి సంబంధించిన అంచనాలు భారీ స్థాయిలో ఉన్నాయి. అయితే ఈ మూవీలో రానా దగ్గుబాటి నటించనున్నట్లు తెలుస్తోంది. 'AA22'లో సినిమాలో కథకి కీలకమైన పాత్రలో కనిపించనున్నాడని టాక్. హీరో, విలన్, ప్రత్యేక పాత్ర అని పట్టించుకోకుండా అన్ని రకాల పాత్రలు చేయడానికి సిద్ధంగా ఉంటాడు రానా. తన పదిహేను ఏళ్ల ప్రయాణాన్ని గమనిస్తే ఈ విషయం స్పష్టంగా తెలుస్తోంది.

ఇక ఇప్పుడు 'AA22'లో కూడా ఒక పాత్ర చేయడానికి రానా ఓకే చెప్పాడన్న న్యూస్ వైరల్‌గా మారింది. ఈ రోల్‌తో రానా అందరినీ సర్‌ప్రైజ్ చేయడం ఖాయమని చెబుతున్నారు. 'AA22'లో దీపికా పదుకొనే కథానాయికగా నటిస్తోంది. ఇప్పటికే అధికారికంగా ప్రకటించారు. అలాగే రష్మిక మందన్న, మృణాల్ ఠాకూర్, జాన్వీకపూర్ నటిస్తున్నట్లు సమాచారం. ఇందులో రష్మికది నెగెటివ్ రోల్ అని టాక్ వినిపిస్తోంది. ఈ చిత్రాన్ని 2027 వేసవిలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. ■

తారాతీరం

# తరుణ్ భాస్కర్ దర్శకత్వంలో చైతూ

రెండు సిని మాలతోనే తనకంటూ ఒక ప్రత్యేకమైన బ్రాండ్ క్రియేట్ చేసుకున్నాడు తరుణ్ భాస్కర్. ప్రస్తుతం ఈ యంగ్ డైరెక్టర్ అటు మెగాఫోన్ పట్టి సినిమాలను తెరకెక్కిస్తూనే, ఇటు నటుడిగా వరుస ప్రాజెక్టులతో బిజీగా గడుపుతున్నాడు. ఇప్పటికే 'ఈ నగరానికి ఏమైంది 2' షూటింగ్‌ను శరవేగంగా పూర్తి చేస్తున్న ఆయన, త్వరలోనే "పెళ్లి చూపులు 2' ను కూడా సెట్స్ పైకి తీసుకెళ్లే ఆలోచ నలో ఉన్నాడు. ఇందులో విజయ్ దేవరకొండ కనిపిస్తాడా లేక కొత్త హీరో వస్తాడా అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. దర్శకుడిగా తరుణ్ భాస్కర్ తన తరువాతి ప్రాజెక్టును నాగచైతన్యతో ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. చైతూ కోసం ఒక ఇంట్రెస్టింగ్ కథను సిద్ధం చేయగా, అది ఆయనకు బాగా నచ్చిందని టాక్. ప్రస్తుతం చైతన్య 'వృషకర్మ' సినిమా పనుల్లో ఉండగా, అది పూర్తయిన వెంటనే తరుణ్ భాస్కర్ సినిమా పట్టాలెక్కే అవకాశం ఉంది. ఒకవేళ అంతా కుదిరితే, 'ఈ నగరానికి ఏమైంది 2' తర్వాత తరుణ్ డైరెక్ట్ చేసే క్రేజీ ప్రాజెక్ట్ ఇదే అవుతుంది.

మరోవైపు, సీనియర్ హీరో వెంకటేష్ కోసం తరుణ్ సిద్ధం చేసిన కథ ఇంకా స్క్రిప్ట్ స్టేజ్‌లోనే ఉంది. సురేష్ బాబు సూచించిన మార్పుల వల్ల ఆ ప్రాజెక్ట్ కాస్త ఆలస్యమవుతున్నట్లు టాక్. ఈ గ్యాప్‌లో చైతన్య తన ఇతర కమిట్‌మెంట్స్‌తో బిజీగా ఉన్నాడు. నాగార్జున – కళ్యాణ్ కృష్ణ కాంబోలో రాబోయే సినిమాలో కూడా చైతూ భాగమయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో, తరుణ్, నాగచైతన్య కాంబినేషన్ ఎప్పుడు సెట్స్ పైకి వెళ్తుందోనని అక్కినేని అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ■



ఆదివారం వార్త

1 మార్చి, 2026

## మంచి ముత్యాలు

- మరణం, దాని సోదరుడు నిద్ర అత్యంత అద్భుతమైనవి.
- చేతిలో వెన్నను ఛీకొట్టి మోచేయి నాకటం మూర్ఖత్వం.
- చక్రవర్తుల వ్యాపారం యుద్ధం.

## కదంబం

'సంఘీ'భావం....5
అనైతిక రాజకీయ పొత్తులు

కవర్ స్టోరీ..6
అడవిని పెంచుదాం..
సమతను పంచుదాం

ఈ వారం కవిత్వం.. 11
పేగుబంధం

కథ..20
నాస్తికుడు

ఆ ముసుగు తొలగాలి.. 23

ఇంకా...

మొగ్గ

పుస్తక సమీక్ష

వాస్తు

వారఫలం

వగైరా.. వగైరా..

## సమాచారం

# నదిలో బంగారం



'బోలి' నది హరియాణాలోని యమునానగర్ జిల్లాలో ప్రవహిస్తుంటుంది. ఆ నదీ తీర ప్రాంతంలో నివసించే ప్రజలకు అది కేవలం నీటి వనరే కాదు.. జీవనాధారం కూడా. అక్కడివారు తరతరాలుగా బంగారం వెలికితీసే రోజువారీ కూలీలుగా జీవిస్తున్నారు. హిమాచల్ ప్రదేశ్ కొండల నుంచి పుట్టిందీ నది. వర్షాకాలంలో ఇసుకతో పాటు సూక్ష్మ బంగారు కణాలను తన వెంట తీసుకొస్తుంది. అక్కడి కొండల్లోని మట్టిలో బంగారం ఉంటుంది. వర్షాకాలంలో ఆ మట్టి కరిగి నదిలో పడుతుంది. దీంతో తీర ప్రాంత ప్రజలంతా ఆ మట్టిలో ఉన్న బంగారాన్ని వెలికి తీయడమే వృత్తిగా మార్చుకొని పొట్ట నింపుకుంటున్నారు. ఒక పడవలో ముగ్గురు లేదా నలుగురు వ్యక్తులు నదిలోకి వెళ్తారు. మట్టిని వడగట్టి బంగారాన్ని వెలికి తీస్తారు. వర్షాకాలంలో బంగారం వెలికి తీయడం అంత సులువైన పని కాదు. పడవల్లో వెళ్తున్నప్పుడు వరదలు వస్తే పడవ తలకిందులవుతుంది. వెంట తీసుకెళ్లిన పనిముట్లు, ఇతర సామాగ్రి కొట్టుకుపోతాయి. కొన్ని సందర్భాల్లో కార్మికుల ప్రాణాలకు ప్రమాదం ఏర్పడుతుంది. అయినా, అవేవీ లెక్క చేయకుండా కుటుంబాన్ని పోషించడం కోసం ఈ పనికి వెళ్తారు.

నదీ ప్రవాహం తగ్గిన తర్వాత బంగారం లభించే అవకాశం వున్న ప్రాంతాలను గుర్తించి తవ్వకాలు ప్రారంభిస్తారు. మట్టిని తీసి నీటిలో పలుమార్లు కడుగుతారు. ఈ క్రమంలో ఇసుక తొలగిపోయి బంగారు రేణువులు మిగులుతాయి. వాటిని ఇంటికి తీసుకెళ్లి శుద్ధి చేసి వేడి చేస్తే స్వచ్ఛమైన బంగారం వస్తుంది. దాన్ని కాంట్రాక్టర్లకు ఇస్తే కూలీడబ్బులు అందుతాయి. అయితే వర్షాకాలం ముగిసినా వీరు బంగారం వేటను కొనసాగిస్తారు. అదృష్టంకొద్దీ పసిడి దొరికితే వారే మార్కెట్లో విక్రయించి సొమ్ము చేసుకుంటారు. అయితే ఇది చాలా అరుదుగా జరుగుతుంటుంది.

మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు.
sunmagvaartha@gmail.com

# ఖర్జూరాలతో కోలా





సాధారణంగా కూల్‌డ్రింక్‌లంటే కోకాకోలా, పెప్సీ వంటివే గుర్తుకొస్తాయి. అరబ్ దేశాల్లో మాత్రం కోలా అంటే మిలాఫ్ కోలానే ఇస్తారు. ఇదేదో కొత్త రకం కోలాలా ఉందే అనుకుంటారు. అయితే ఇందులో చక్కెర లేకుండా కేవలం ఖర్జూరాలనే వాడి చేసిన సాఫ్ట్‌డ్రింక్. ఇలా తయారు చేయడం ఇదే మొదటిసారి.

అరేబియా దేశాల్లో కొన్నేళ్లపాటు కోలాలపైన నిషేధం విధించారు. కూల్‌డ్రింక్‌లు ఆరోగ్యానికి హానికరమని తెలిసినా యువత మానడంలేదు. అందుకు మరికొన్ని రాజకీయ కారణాలు కూడా తోడవడంతో ఆ దేశాల్లో చాలా రోజులు పాటు కోలాలపై నిషేధం కొనసాగింది.

ఆ తర్వాత ఆ నిషేధం ఎత్తివేసినా సాఫ్ట్‌డ్రింక్‌లకు సరైన ప్రత్యామ్నాయం తీసుకురావాలన్న ఆలోచనతో కృత్రిమ చక్కెరలు వాడకుండా నాణ్యమైన ఖర్జూరాలని వాడి సోడా తరహాలో ఉండేలా మిలాఫ్ కోలాను తయారు చేశారు. ముఖ్యంగా యువతను ఆకట్టుకునేందుకు కోలాలా ఉండేలా డిజైన్‌ను రూపొందించారు. ఆరోగ్యానికి మేలు చేసే ఈ డ్రింక్‌ను ప్రపంచవ్యాప్తంగా అందుబాటులోకి తేవాలనుకుంటున్నట్లు తయారీ దారులు ప్రయత్నిస్తున్నారు. ఇటువంటి కోలాల వల్ల ఆరోగ్యం పాడవదంటే ఎవరైనా తీసుకోవచ్చు.

# స్టార్ సిటీ (పాల్మనోవా)

ఒక పట్టణాన్ని అందమైన ఆకారంలో నిర్మిస్తే ఆశ్చర్యపోకుండా ఉంటామా? అలాంటి వింత పట్టణమే ఇటలీలోని పాల్మనోవా అనే స్టార్ ఫోర్ట్ టౌన్. ఈ పట్టణాన్ని 16వ శతాబ్దంలో సైనికుల రక్షణ కోసం ప్రత్యేకంగా నిర్మించారు. పట్టణం లే అవుట్ అంతా నక్షత్రం ఆకారం వచ్చేలాగా భవనాలను కట్టారు. అలాగే మొక్కల్ని పెంచారు. పట్టణం చుట్టూ నీటి కాలువలని అదే అకృతిలో మలిచారు. ఈ పట్టణం సైనిక రక్షణ కోసం వెలసిన ఒక కళాఖండంగా నిలిచింది. 2017లో యునెస్కో ప్రపంచ వారసత్వ హోదాలో భాగమైన కోటగోడలు దీని ప్రధాన ఆకర్షణ. ఈ పట్టణానికి కేవలం మూడు ప్రవేశ ద్వారాలు మాత్రమే ఉంటాయి. చుట్టూ కందకం మాదిరి నీటి కాలువలు ఉంటాయి.



పాల్మనోవా పట్టణం ఇటలీలోని అత్యంత అందమైన గ్రామాలలో ఒకటిగా చెప్పుకుంటారు. ఈ పట్టణంలో దాదాపు 6,000 మంది నివసిస్తున్నారు. నగరంలో ఉండే మిలిటరీ మ్యూజియంలో పట్టణ రక్షణ చరిత్రను వివరించే కళాఖండాలు ఉంటాయి. ఈ నగరం ప్రస్తుతం ఒక ముఖ్య పర్యాటక ప్రదేశంగా విలసిల్లుతున్నది.

# షాక్ సిరంజీ



పిల్లలే కాదు ఎంత ధైర్యస్థులయినా పెద్దలు కూడా సూదిమందు (ఇంజెక్షన్) అంటే తెగ భయపడిపోతుంటారు. ఆ ఫోబియాని ఓ చిన్న ఆవిష్కరణ వల్ల దూరం కానుంది. దాని పేరే షాక్ సిరంజీ.

ఐఐటీ బాంబేకి చెందిన పరిశోధకులు నొప్పిలేని ఈ సూదిని తీసుకొచ్చారు. దీని మీద వున్న స్విచ్ నొక్కితే లోపల ఉన్న మందు బుల్లెట్‌లా ఎంతో వేగంగా శరీరంలోకి దూసుకుపోతుంది. తద్వారా ఎలాంటి నొప్పి ఉండదు, వాపు కూడా ఉండదు. షాక్‌లా చిటుక్కుమన్నట్టు అనిపిస్తుందట. అంతే..! తరచుగా వ్యాక్సిన్లు, ఇంజెక్షన్లు చేయించుకోవాల్సి వచ్చే వారికి ఈ సూదితో ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పవచ్చు. వీటి వల్ల ఒకరి నుండి మరొకరికి ఇన్‌ఫెక్షన్లు సోకుతాన్న యన్న భయం అసలే ఉండదు.

## 'సంఘీ' భావం



# అనైతిక రాజకీయ పొత్తులు

రాజకీయాల్లో శాశ్వత మిత్రులు, శాశ్వత శత్రువులు ఉండరని ఒక నానుడి ఉంది. వ్యక్తులే కాదు ఇది పార్టీలకు కూడా వర్తిస్తుంది. దీనికి తాజా ఉదాహరణ ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికలు. అంతకు ముందే పంచాయితీ ఎన్నికలు జరిగినా అవి పార్టీలకు అతీతంగా జరగడంతో దానిపై పెద్దగా చర్చ అవసరం లేకుండా పోయింది. కనిపిస్తే చాలు.. కత్తులు రువ్వుకునే పార్టీలు మున్సిపల్ ఎన్నికల్లో అన్నీ పక్కన పెట్టి పదవులే పరమార్థంగా వ్యవహరించాయి. దీనికి కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు వేటికవే విచిత్రంగా వ్యవహరించాయి. అధ్యక్ష పీఠాన్ని చేజిక్కించుకోవడానికి ఒకరికొకరు మినహా యింపులు ప్రకటించుకుని ఆగర్భ స్నేహితులుగా ఆలింగనం చేసుకున్నారు. ఎన్నికల ముందు వరకు ప్రత్యర్థి పార్టీలు అనైతిక పొత్తులు కలిగి ఉన్నారని ప్రచారం చేసిన పార్టీ నేతలు మేయర్, చైర్మన్ ఎన్నికల్లో మరచిపోయి ఒకరి కొకరు సహకరించుకున్నారు.సాధారణంగా ఒక్కొక్క పార్టీకి ఒక్కొక్క అజెండా ఉంటుంది.కాంగ్రెస్, బిజెపి పరస్పర విరుద్ధమైన సిద్ధాంతాలు కల పార్టీలు. అదేవిధంగా బిఆర్ఎస్‌కు, కాంగ్రెస్‌కు రాష్ట్రంలో అగ్గినిప్పు అన్న చందాన ఉంటారు. కానీ అధికారం కళ్లముందు కనిపించే సరికి అన్నీ మరిచిపోయారు. మున్సిపల్ చైర్మన్ ఎన్నికల సందర్భంగా తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త సన్నివేశాలు కనిపించాయి. నేతలకు నచ్చిన వారికి ఎక్స్ అఫీషియో ఓట్లు వేసిన పరిస్థితి. ఓ చోట బీఆర్ఎస్.. మరో చోట కాంగ్రెస్‌కు బీజేపీ మద్దతు తెలుపుకున్నారు. ముఖ్యంగా హంగ్ వచ్చిన మున్సిపాలిటీల్లో అధికారం దక్కించుకునేందుకు అధిష్టానం అదేశాలను సైతం పక్కన పెట్టి పరిస్థితులను బట్టి ఒకరికి ఒకరు సహకరించుకున్నారు.

రాష్ట్రంలో ప్రధాన ప్రత్యర్థి పార్టీలు కాంగ్రెస్, బిజెపి. బీఆర్ఎస్‌లు. కాంగ్రెస్ అధికారంలో ఉండగా, బీఆర్ఎస్ ప్రధాన ప్రతిపక్షంగా, బిజెపి ప్రత్యర్థి పార్టీగా ఉంది. కాంగ్రెస్ హామీలు, గ్యారెంటీలతో పాటు సీఎం, మంత్రులపై తీవ్ర విమర్శలు చేస్తున్నారు. బీఆర్ఎస్‌పై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపిస్తున్నారు. కాంగ్రెస్ కూడా బీఆర్ఎస్ పదేళ్ల పాలనలోని లోపాలను ఎత్తిచూపుతోంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ పొత్తులతో 5 మున్సిపాలిటీ పీఠాలను కైవసం చేసుకున్నారు.కామారెడ్డి, దేవరకద్ర, వేములవాడ, ఇస్నాపూర్, అమరచింత మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ పదవులను దక్కించుకుని బీజేపీకి చెక్ పెట్టాయి కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు.

కరీంనగర్ కార్పొరేషన్‌లో 60 డివిజన్లు ఉండగా ఇందులో బీజేపీ 30 స్థానాలు గెలుచుకుంది. కాంగ్రెస్ ఎత్తుగడతో కరీంనగర్‌ను కైవసం చేసుకునే ప్రయత్నం చేస్తుంటే మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికకు బీఆర్ఎస్ గైర్హాజర్ అయింది. అంటే పరోక్షంగా బిజెపికి మద్దతుగా నిలిచింది. దీంతో బీజేపీ మేయర్ పీఠాన్ని కైవసం చేసుకుంది. జిన్నారం, ఆమన్‌గల్ మున్సిపాలిటీలను కాంగ్రెస్, బీజేపీ కలిసి దక్కించుకున్నాయి. అలియాబాద్ మున్సిపాలిటీలో మ్యాజిక్ ఫిగర్ 11 కాగా, ఏ పార్టీకి మెజార్టీ రాలేదు. దీంతో 8 సీట్లున్న కాంగ్రెస్‌కు 3 సీట్లున్న బీజేపీతో పాటు ఇద్దరు స్వతంత్రులు మద్దతు ప్రకటించారు. దీంతో కాంగ్రెస్ బలం 13కి చేరి విజయం సాధించింది. జిల్లా రాజకీయాల్లో ప్రత్యర్థులుగా ఉండే కాంగ్రెస్, బీజేపీలు ఇక్కడ చేతులు కలపడం ఆసక్తికరంగా మారింది. జిన్నారం మున్సిపాలిటీలో బీఆర్ఎస్ పార్టీ 8 సీట్లు గెలవగా ఇక్కడ ఇండిపెండెంట్లు,బీజేపీ మద్దతుతో చైర్మన్, వైస్ చైర్మన్ పదవులను దక్కించుకుంది. కాగజ్ నగర్ మున్సిపాలిటీలో కాంగ్రెస్‌కు బిజెపి అండగా నిలిచింది. ఇక బీజేపీ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు మైనార్టీ నేతకు ఓటు వేసి అందరినీ విస్మయంలో ముంచెత్తారు. ఇక ఇస్నాపూర్ మున్సిపాలిటీని బీజేపీ మద్దతుతో బీఆర్ఎస్ దక్కించుకుంది. ఇక్కడ బీఆర్ఎస్ పార్టీ 12 మంది కౌన్సిలర్లతో పాటు, పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, మెదక్ ఎంపీ రఘునందన్ రావు ఎక్స్ అఫీషియో ఓట్ల మద్దతుతో మున్సిపల్ పీఠాన్ని దక్కించుకుంది. ఏకంగా బీజేపీ ఎంపీ రఘునందన్ రావు బీఆర్ఎస్‌కు మద్దతు తెలపడం విశేషం. బీఆర్ఎస్ చైర్మన్ అభ్యర్థికి ఓటేసేందుకు గూడెం మహిపాల్ రెడ్డి, రఘునందన్‌రావు ఒకే కారులో రావడం మరింత చోద్యంగా చెప్పుకోవచ్చు.

అధికార పీఠం కోసం సిద్ధాంతాలు, పోరాటాలు,వర్గాలు అన్నీ పక్కన పెట్టాయి. పార్టీ అధిష్టానం హెచ్చరికలను సైతం ఖాతరుచేయకుండా పార్టీ నేతలు వ్యవహరించారు. పార్టీల అజెండాలను నమ్మి ఓట్లు వేసిన ఓటర్లు మాత్రం పార్టీల వైఖరి చూసి తెల్లముఖం వేశారు.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ

# అడవిని పెంచుదాం.. సమతను పంచుదాం

కవర్ స్టోరీ

రుద్రరాజు శ్రీనివాసరాజు



**ప్రకృతి వైవిధ్యానికి నిలువుటద్దం వన్యప్రాణులు. అడవిలో గర్జించే పులి నుంచి ఆకాశంలో విహరించే చిట్టి పిచ్చుక వరకు.. ప్రతి జీవి ఈ భూమిపై పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తుంది.**

ఈ విశ్వంలో మనిషి కంటే ముందే జంతువులు భూమి మీద జీవించాయని సైన్స్ ఆధారాలతో సహా నిరూపించింది. అయితే మనిషి ఆవిర్భావం తరువాత మనిషి కంటే ముందే వచ్చిన చాలా జంతువుల జాడ ఇప్పుడు కానరావడం లేదు. కొన్ని జంతువులు అంతరించిపోయాయి. కొన్ని అంతరించిపోయే దశలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో వన్యప్రాణుల రక్షణపై అవగాహన కల్పించేందుకు ప్రతి ఏటా మార్చి 3న నిర్వహిస్తున్న 'ప్రపంచ వన్యప్రాణి దినోత్సవం' సందర్భంగా ఈ ఆదివారం కవర్ స్టోరీ.

ఈ భూమిపై జీవించడానికి, మానవులు మనుగడ సాగించడానికి ఎంత హక్కు ఉందో అలాగే జంతువులకు కూడా అదే హక్కు ఉంది. మూగ జీవాలు అయినంత మాత్రాన వాటికి హక్కులు లేకపోలేదు. సృష్టి నిర్మాణంలోనే జీవ వైవిధ్యం పాటిస్తూ ఒక్కో జీవికి ఒక్కో రకమైన ఆహారం, ఆవాసం ప్రకృతిలో ఏర్పాటు జరిగింది. జంతువులు పక్షులు జల చరాలు.. ఇలా అనేకం భూమిపై, ఆకాశంలో, నీటిలో జీవనం సాగించే ఏర్పాటు ప్రకృతిలోనే జరిగింది. ఈ సందర్భంలో మానవుడు మచ్చిక చేసుకోవడానికి వీలులేని జంతువులకు ఆవాసాలుగా అడవులను ఏర్పాటు జరిగింది. వీటినే వన్య ప్రాణులు అంటారు. వీటికి ప్రత్యేక ఆవాసం ఉంది. మానవుల ఆవాసాలు లోనికి అవి రావు. కానీ మానవుడు మాత్రం వాటి ఆవాసాలలోనికి చొచ్చుకు పోతున్నాడు, వాటికి హాని తలపెడుతున్నాడు. ఒక పక్క మానవ ప్రమేయంతో ఖనిజ ఇంధనాల విచ్చలవిడి వాడకం కారణంగా పెరుగుతున్న కాలుష్యం, దాని ఫలితంగా పెరుగుతున్న భూతాపం వన్యప్రాణులు అంతరించడానికి కారణమైతే, మరొకపక్క అటవీ వినాశనం జరుగుతూ ఉంది. పర్యావరణ పరిరక్షణలో, జీవ వైవిధ్యాన్ని కాపాడటంలో అడవులు పాత్ర చాలా కీలకం. అయితే వన్య మృగాలు అంతరించిపోవడానికి మానవ తప్పిదాలే కాకుండా ప్రకృతి వైపరీత్యాలు కూడా కారణం అవుతున్నాయి.

యథేచ్ఛగా సాగుతున్న అడవుల నరికివేత, విశృంఖలమైన వేట, వ్యవసాయ పద్ధతుల్లో మార్పుల వల్ల పెరిగిన పురుగు మందులు, రసాయనిక ఎరువుల వినియోగం వంటివి వన్యప్రాణుల మనుగడకు తీవ్ర స్థాయిలో ముప్పు తెచ్చిపెడుతున్నాయి. ఇవన్నీ మానవ తప్పిదాలు. వీటిని నియంత్రించకుంటే మన కళ్ల ముందే చాలా జీవజాతులు అంతరించిపోయే ప్రమాదం ఉంది. వన్య ప్రాణులు ఉనికి కి ప్రమాదం వాటిల్లడానికి ప్రధాన కారణాలు.

**అటవీ క్షీణత:** ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోతున్న జనాభాతో పాటు మనిషి ఆధునిక జీవన శైలి కారణంగా అడవులు అన్యాక్రాంతమవుతున్నాయి. ఫలితంగా అరుదైన జీవ, జంతుజాలాలు క్రమంగా కనుమరుగైపోతున్నాయి.

**జనాభా విస్ఫోటనంఅభివృద్ధి:** జనాభా విస్ఫోటం వల్ల వ్యవసాయాభివృద్ధి, పారిశ్రామికీకరణ, నగరీకరణ, తదితర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం చేత అడవులు తరగిపోతూ వన్యప్రాణుల జీవనానికి ముప్పు వాటిల్లుతోంది.

**ఆవాసాల విధ్వంసం:** పచ్చని అరణ్యాలు పలుచపడు తున్నాయి. కొండలు జనావాసాలుగా రూపాంతరం చెందాయి. దీంతో అరణ్యంలో ఉండాల్సిన వన్య ప్రాణులు ఆవాసాలు కోల్పోయి జనారణ్యంలోకి ప్రవేశించి ప్రాణాలు కోల్పోతున్నాయి. అడవిలో ఆహారం లభ్యం కాని పరిస్థితులలో అవి జనావాసాలకు రావడం ఆ సందర్భంలో రహదారులపై ప్రమాదాలకు గురై కొన్ని మరణిస్తుండగా మరికొన్ని ప్రాణ రక్షణ కోసం హతమారుస్తున్న ఘటనలు కూడా లేకపోలేదు. ఈ మధ్యనే మహారాష్ట్ర అడవుల నుండి చెదిరి వచ్చిన పులులు తెలంగాణ, ఆంధ్ర ప్రాంతంలోని జనావాసాలలోకి రావడం జరిగింది.

**పారిశ్రామికీకరణ:** అభివృద్ధి పేరుతో అటవీ ప్రాంతాలలో కూడా ప్రాజెక్టులు, ఆనకట్టలు నిర్మించడం, గనుల తవ్వకాలు, రోడ్లు వేయడం వంటి పనులను చేపట్టడం వలన వన్యప్రాణుల మనుగడకు పెనుముప్పుగా మారింది.

**భూతాపం:** మానవ కార్యకలాపాల వలన భూతాపం రోజు రోజుకు పెరిగిపోతోంది. ఈ సమయంలో మానవులు ఈ వేడిమి నుండి రక్షింపబడటానికి అనేక ప్రత్యామ్నాయాలు అనుసరిస్తూ ఉండగా అడవిలో నివసించే మూగ జీవాలకు వేరే మార్గం లేక అనేకం చనిపోతున్నాయి.

**మైనింగ్:** మైనింగ్ వల్ల అటవీ ప్రాంతాలు తీవ్రంగా నష్టపోయాయి. మైనింగ్‌కు అటవీ భూముల్ని తీసుకుంటే,



అందుకు ప్రత్యామ్నాయంగా భూముల్ని కేటాయించి సామాజిక అడవుల్ని పెంచడానికి నిధులు మంజూరు చేయాలి. **నీటి పారుదల ప్రాజెక్టులు:** నదుల ద్వారా వచ్చే నీటిని సముద్రం పాలు కాకుండా సాగు నీటికి తాగు నీటికి వినియోగంలోనికి తీసుకురావాలి అంటే ప్రాజెక్టుల నిర్మాణం తప్పనిసరి. అదే సమయంలో పర్యావరణ పరిరక్షణ కూడా అత్యంత ఆవశ్యకం.

**ప్రకృతి వైపరీత్యాలు:** మానవ తప్పిదాలు వల్లనే కాకుండా కొన్నిసార్లు ప్రకృతి వైపరీత్యాలు, ప్రమాదాలు కూడా వన్యప్రాణులు అంతరించిపోవడానికి కారణమవుతుంటాయి. ప్రకృతి వైపరీత్యాలైన గ్రహశకలాలు భూమిని తాకడం, భూకంపాలు, కార్చిచ్చులు వంటి ఉత్పాతాలు జీవరాశికి చేటు తెచ్చిపెడుతుంటాయి.

**జన్యు వైవిధ్యం** :అడవుల నరికివేత,కార్చిచ్చుల కారణంగా వన్యప్రాణులు ఆవాసం కోల్పోయి అంతరించిపోయే పరిస్థితులకు చేరుకుంటున్నాయి. జన్యు వైవిధ్యం కొరవడటం కారణంగా కొన్ని ప్రాణులు కనుమరుగయ్యే స్థితికి చేరుకుంటున్నాయి. ఆఫ్రికన్ చిరుతలు జన్యు వైవిధ్యం కొరవడటం వల్ల త్వరగా అంతరించిపోతున్నాయని శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఐక్యరాజ్య సమితి సహా పలు అంతర్జాతీయ సంస్థలు మనుషుల స్వార్థం ఫలితంగానే దాదాపు పది లక్షలకు పైగా జాతులకు చెందిన వన్యప్రాణులు అంతరించిపోయే పరిస్థితుల్లో ఉన్నాయని హెచ్చరికలు చేస్తున్నాయి.

భారత్‌లో దాదాపు సగం వన్యప్రాణులు అంతర్ధాన దశలో ఉన్నాయని తన ద్వైవార్షిక నివేదిక 'ది లివింగ్ ప్లానెట్ రిపోర్ట్-2016'లో తేటతెల్లం చేసింది! మన దేశంలో దాదాపు 132 జీవజాతులు అంతరించిపోయే పరిస్థితులకు చేరువగా ఉన్నాయని, వీటిలో 49 వృక్షజాతులు కూడా ఉన్నాయని 'ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్' (ఐయూసీఎన్) గత ఏడాది విడుదల చేసిన నివేదికలో హెచ్చరించింది.

## రెడ్ డేటా బుక్

ప్రపంచ వన్యప్రాణుల సమాఖ్య(డబ్ల్యుడబ్ల్యుఎఫ్, అంతర్జాతీయ వన్య ప్రాణుల సంరక్షణ సంఘం (ఐయుడబ్ల్యుసి) ఈ రెండు సంస్థలు కూడా అంతరించి పోతున్న/అంతరించిన మొక్కలు, జంతువుల సమాచారాన్ని పుస్తక రూపంలో ప్రచురిస్తాయి. ఈ పుస్తకాన్ని రెడ్ డేటా బుక్ అంటారు. ఈ బుక్ అంతరించిపోతున్న జాతి లేదా వర్గాలను సంరక్షించుకోవాల్సిన అవసరాన్ని తెలియజేసే సూచికగా ఉపయోగపడుతుంది. భారతదేశంలో రెడ్ డేటా లిస్టు ప్రకారం పులులు, ఏనుగులు, రాబందులు, స్నోలియోపార్డ్, హాలీవ్‌రిడ్లీ అనే సముద్ర తాబేలు, గంగేస్ రివర్ డాల్ఫిన్ అనే మంచినీటి డాల్ఫిన్, ఆసియాటిక్ లయన్ మొదలైన కొన్ని జాతులు ప్రమాదంలో ఉన్నాయని పేర్కొనడం జరిగింది.

**ఏనుగు:** ఆసియా మొత్తంలో ఈ ఏనుగులు అత్యధికంగా నెలకొని ఉన్నాయి. కానీ కాలగమనంలో ఏనుగులు క్రమేపీ క్షీణించడం మొదలయ్యాయి. ఎందుకంటే ప్రపంచ వ్యాప్తంగా ఏనుగుల దంతాలకు అత్యధిక గిరాకీ ఏర్పడటంతో వేటగాళ్ళు వీటిని విపరీతంగా వేటాడే వాటిని హతమార్చడం మొదలుపెట్టారు. అంతే కాకుండా అటవీ ప్రాంతాలలో నెలకొన్న రైల్వే ట్రాక్‌లను దాటుతూ ఉన్న సందర్భంలో కూడా ఇవి చాలా వరకు మరణిస్తున్నాయి.

**బెంగాల్ టైగర్:** దేశంలో అత్యంత వేగంగా అంతర్ధానం అవుతున్న జంతువుల్లో బెంగాల్ టైగర్ ఒకటి.

**పిగ్మీ హగ్:** భారత్, నేపాల్, భూటాన్ అడవుల్లో ఈ పిగ్మీ హగ్‌లు ఎక్కువగా కనిపిస్తూ ఉండేవి. ప్రస్తుతం అస్సాం రాష్ట్రంలో అవి కొంతవరకు కనిపిస్తున్నాయి ఒకప్పుడు లక్షల్లో కనిపించిన ఇవి నేడు వేటగాళ్ల బారిన పడి చాలా వరకు అంతరించిపోయాయి. ప్రస్తుతం కేవలం 150 మాత్రమే ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. దీనిని బట్టి అతి తక్కువ సమయంలోనే ఇవి అంతరించే ప్రమాదం దగ్గరలోనే ఉందని చెప్పవచ్చు.

**గంగా పరివాహక డాల్ఫిన్:** ఇది ఎక్కువగా భారత్, బంగ్లాదేశ్, నేపాల్ దేశాల్లో కనిపిస్తూ ఉండేది. కానీ 1996 నుంచి ఇవి క్రమేపి అంతరించిపోవడం మొదలైంది.

**కొండ గొర్రెలు:** కొండ గొర్రెలు పశ్చిమ కనుమల్లో ఎక్కువగా కనిపిస్తాయి.మన దేశంలో తమిళనాడు, కేరళలో ఇవి ఎక్కువగా కనిపిస్తూ ఉండేవి. అయితే వేటగాళ్ల బారిన పడుతున్న ఇవి లక్షల్లో ఉన్నటువంటి ఈ కొండ గొర్రెలు నేడు వేలల్లోకి పడిపోవడం చాలా విచారించదగ్గ విషయం. ప్రస్తుతం మన దేశంలో కేవలం ఇవి 2000 మాత్రమే ఉండటం విచారించదగ్గ విషయం.

**ఇండియన్ పంగోలిన్:** ఇండియన్ పంగోలియన్ శరీరం మొత్తం పొలుసులు పొలుసులుగా ఉంటుంది. ఈ జీవి ఎక్కువగా భారత్, నేపాల్, శ్రీలంక, భూటాన్ దేశాలలో కనిపిస్తూ ఉండేవి. ప్రస్తుతం వీటి సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. వీటి శరీర భాగాలు వైద్య రంగంలో ఎక్కువగా ఉపయోగపడతాయి. అంతేకాకుండా వీటి మాంసం కూడా మంచి రుచికరంగా ఉండడం వలన వీటిని వేటాడి పూర్తిగా అంతరించే స్థితికి తీసుకొచ్చేశారు. 2008లో దీనిని అత్యంత అరుదైన ప్రాణుల జాబితాలో చేర్చారు.

**అసోం కుందేలు:** అంతరించిపోయే జాబితాలో ఉన్న మరో చిరు జీవి అసోం కుందేలు. హిమాలయాలు మొదలుకొని ఎక్కడపడితే అక్కడ విస్తృతంగా కనిపించే ఈ చిట్టి జీవి ఐదు దశాబ్దాలుగా తన మనుగడ కోసం పడరాని పాటలు పడుతూ ఉంది. అత్యంత అరుదైన జంతు జాబితాలో ఇది చేరిపోయింది.

**రెడ్ డాగ్:** ఒకప్పుడు మధ్య దక్షిణ ఆసియాలో విస్తృతంగా కనిపించిన ఈ రెడ్ డాగ్ అత్యంత అరుదైన జాబితాలో జాబితాలోకి చేరిపోయింది.

**రాబందులు:** భారతదేశంలో తొమ్మిది రకాల రాబందులు ఉన్నాయి. అయితే ఈ మధ్య కాలంలో వీటి సంఖ్య క్రమంగా తగ్గుతూ వస్తోంది.



**మొసలి:** భారతదేశంలో కనిపించే మూడు మొసళ్లలో ఘరియల్ ఒకటి. ఇవి ఎక్కువగా గంగా నదిలో కనిపిస్తాయి. చంబల్, బ్రహ్మపుత్ర నదులలో కూడా ఉంటాయి. ఘరియల్ జాతి మొసలి భారతదేశంలో అత్యంత ప్రమాదంలో ఉన్న జాతులలో ఒకటిగా పరిగణిస్తున్నారు. కలుషిత నీటి కారణంగా వీటి మరణాలు ఎక్కువవుతున్నాయి.

**ఏసియాటిక్ సింహం:** ఏషియాటిక్ సింహం ప్రపంచలోనే అతిపెద్ద సింహాలలో ఒకటి. ఈ సింహాలు ఇప్పుడు భారతదేశంలో మాత్రమే కనిపిస్తున్నాయి. గుజరాత్‌లోని గిర్ నేషనల్ పార్కులో వీటిని చూడవచ్చు. 2010 నుంచి వీటి జాతి తగ్గుతున్న క్రమంగా అంతరించిపోయే లిస్టులో చేర్చారు. 2020 లెక్కల ప్రకారం దేశంలో మిగిలి ఉన్న ఆసియా సింహాల సంఖ్య 674 మాత్రమే.

**రెడ్ పాండా:** తూర్పు హిమాలయాలకు చెందిన ఎర్రని గోధుమ రంగు ఎర్బోరియల్ క్షీరదం రెడ్ పాండా. వేట కారణంగా వేగంగా క్షీణిస్తున్న మరొక జాతి. దీనిని సిక్కిం, అరుణాచల్ ప్రదేశ్, పశ్చిమ బెంగాల్‌లోని ఖాంగ్‌చెండ్‌జోంగా, నామదఫా జాతీయ ఉద్యానవనాలలో చూడవచ్చు.

**ఒక కొమ్ము గల ఖడ్గమృగం:**ఒక కొమ్ము గల ఖడ్గమృగం కొన్ని సంవత్సరాలుగా కనుమరుగవుతున్నాయి. ఈ భారతీయ జంతువులు కాజీరంగా జాతీయ ఉద్యానవనం, దుధ్వా టైగర్ రిజర్వ్, పోబిటోరా వన్యప్రాణుల అభయారణ్యం, భారతదేశం, నేపాల్‌లోని హిమాలయ పర్వత ప్రాంతాల్లో చూడవచ్చు.

**చీతాలు:** ప్రపంచంలో మొత్తం నాలుగు చీతా ఉపజాతులు ఉన్నాయి. ఒకప్పుడు ఆసియా ఖండమంతటా వ్యాపించి ఉన్న చీతా 1952 నాటికి భారత్‌లో అంతరించింది. విపరీతమైన వేట, ఆవాసాల నష్టం, ఆహార జంతువులు తరిగిపోవడం తదితరాలు అది కనుమరుగవడానికి కారణం. నేడు ఆసియా జాతి చీతాలు ఇరాన్‌కు మాత్రమే పరిమితమయ్యాయి. వాటి మనుగడ పెను ప్రమాదంలో పడినట్లు అంతర్జాతీయ ప్రకృతి సంరక్షణ సంస్థ వెల్లడించింది.

## తాజా నివేదికల ప్రకారం అత్యంత ప్రమాదంలో ఉన్న జీవులు

**గ్రేట్ ఇండియన్ బస్టర్డ్:** ఇవి ప్రస్తుతం 140 కంటే తక్కువగా ఉన్నాయి. హై వోల్టేజ్ విద్యుత్ తీగలు వలన వీటికి ముప్పు ఏర్పడింది.

**గంగా నది డాల్ఫిన్:** ఇవి సుమారు 6,300 వరకూ ఉన్నాయి. నీటి కాలుష్యం, డ్యామ్‌లు కారణంగా ఇవి తరిగి పోతున్నాయి.

**హిమ చిరుత** (Snow Leopard): వాతావరణ మార్పులు, వేట కారణంగా ఇవి అరుదైపోయాయి.

– ఆవాసాల నష్టం కారణంగా బంగాల్ టైగర్ సంఖ్య 3,700కు తగ్గిపోయింది.

– కొమ్ము కోసం వేట వలన ఒంటికొమ్ము ఖడ్గమృగం సంఖ్య తగ్గిపోయింది.

## వన్య ప్రాణుల సంరక్షణ

వన్య ప్రాణులను సంరక్షించడం కోసం అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేకమైన సంస్థలు వెలిశాయి. అవి ప్రకృతి వనరుల సంరక్షణ గురించి అంతర్జాతీయ యూనియన్ (ఐయుసిఎన్), ప్రపంచ వన్య ప్రాణుల నిధి (డబ్ల్యుడబ్ల్యుఎఫ్). ఇవి వన్యప్రాణి సంరక్షణ కోసం రెండు రకాల ప్రతిపాదనలు చేయడం జరిగింది. మొదటిది: భూమిపైన గల భౌతిక పరిసరాలను, అరుదైన వృక్షజాతిని కాపాడడం. రెండవది: వైవిధ్యమైన జంతులను సంరక్షించడం. ఇప్పటికే పలు దేశాలు వన్యప్రాణుల కాపాడటానికి విభిన్న చట్టాలు అమలులోనికి తీసుకు వచ్చాయి.

**వన్యప్రాణి సంరక్షణకై..** ప్రపంచ దేశాలు చట్టపరమైన చర్యలు చేపట్టడానికి ఐక్యరాజ్యసమితి వాతావరణ కార్యక్రమం (యుఎన్ఇపి) ఆధ్వర్యంలో వన్య ప్రాణుల వలస జాతుల రక్షణకై..

అంతర్జాతీయ వలస జాతుల భాగస్వామ్య పక్షాల సదస్సు (కోప్) ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి నిర్వహిస్తూ వాటి సంరక్షణ చర్యలపై చర్చించడం జరుగుతోంది. వన్యప్రాణుల సంరక్షణకు అంతర్జాతీయ స్థాయిలో ఐక్యరాజ్యసమితికి అనుబంధంగా ఐయుసిఎన్ (ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్సర్వేషన్ ఆఫ్ నేచర్ అండ్ నేచురల్ రిసోర్సెస్) అనే సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచంలో అంతరించే దశలో, ప్రమాదంలో ఉన్న జీవజాతులను గుర్తించి రెడ్ డేటాబుక్‌లో పొందుపరచడం జరిగింది. ఆ జాతులను సంరక్షించడానికి తగిన విధంగా చర్యలు చేపట్టాలని ప్రపంచ దేశాలను ఆదేశించడం జరిగింది. దానికి అనుగుణంగా ప్రతి దేశం కూడా వన్యప్రాణుల సంరక్షణకు అభయారణ్యాలు, జాతీయ పార్కులు, ప్రత్యేక రక్షిత కేంద్రాలు లాంటి అనేక రక్షిత కార్యక్రమాలను చేపడుతున్నాయి.



## ప్రపంచ వన్యప్రాణి పరిరక్షణ దినోత్సవం

ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ 2013 డిసెంబర్ 20న జరిగిన తన 68వ సమావేశంలో చేసిన తీర్మానం ప్రకారం ఆమోదించింది. మార్చి 3ని ప్రపంచ వన్యప్రాణి దినోత్సవంగా ప్రకటించారు. ప్రతీ సంవత్సరం ఈ దినోత్సవాన్ని ఒక ప్రత్యేక థీమ్‌తో జరుపుకుంటారు. దీనిలో భాగంగా ఈ ఏడాది(2026) థీమ్‌గా 'ఔషధ, సుగంధ మొక్కలు-ఆరోగ్యం, వారసత్వం, జీవనోపాధి పరిరక్షణ' అని ప్రకటించడం జరిగింది. (Medicinal and Aromatic Plants: Conserving Health, Heritage and Livelihoods). కేవలం జంతువులే కాదు, మన ఆరోగ్యానికి మూలాధారమైన మొక్కలను రక్షించడం కూడా వన్యప్రాణి సంరక్షణలో భాగమేనని ఇది గుర్తుచేస్తోంది.

## ప్రపంచ వేదికపై వన్యప్రాణి పరిరక్షణ: అగ్రగామి దేశాలు

ప్రపంచవ్యాప్తంగా కొన్ని దేశాలు వన్యప్రాణి సంరక్షణలో రోల్ మోడల్స్‌గా నిలుస్తున్నాయి. అవి అవలంభిస్తున్న విధానాలు అద్భుతమైన ఫలితాలను ఇస్తున్నాయి.

**బోట్స్వానా:** ఆఫ్రికా ఖండంలో అత్యధిక ఏనుగుల జనాభా ఉన్న దేశం. కమ్యూనిటీ ఆధారిత పర్యాటకం ద్వారా స్థానిక ప్రజలను రక్షకులుగా మార్చడంలో ఈ దేశం సఫలమైంది.

**కోస్టారికా:** తన భూ భాగంలో 25 కంటే ఎక్కువ అడవులను రక్షిత ప్రాంతాలుగా ప్రకటించింది. జీవ వైవిధ్య సంరక్షణలో ఇది ప్రపంచంలోనే నంబర్ 1 స్థానంలో ఉంది.

**నార్వే ఫిన్లాండ్:** ఆర్కిటిక్ ప్రాంతంలోని వన్యప్రాణుల రక్షణ కోసం కఠినమైన వాతావరణ చట్టాలను అమలు చేస్తున్నాయి.

## భారత్ చర్యలు

మన దేశ రాజ్యాంగంలో వన్య ప్రాణుల సంరక్షణకు అధిక ప్రాధాన్యతనిచ్చారు. రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలలోని ఆర్టికల్ 48ఎలో, ప్రాథమిక విధులలోని ఆర్టికల్ 51ఎలో వన్యప్రాణుల సంరక్షణపై ప్రభుత్వానికి, పౌరులకు ఆదేశాలు జారీ చేయడం జరిగింది. నేషనల్ బోర్డ్ ఫర్ వైల్డ్ లైఫ్‌ను 1952లో నెలకొల్పారు. ఆదేశిక సూత్రాల్లోనూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధిగా వన్యప్రాణులను సంరక్షించాలని పేర్కొన్నారు. దానికి అనుగుణంగా ఎన్నో చట్టాలు మనదేశంలో తీసుకువచ్చారు.

## భారతదేశంలో పరిరక్షణ చట్టాలు-తాజా సవరణలు

భారతదేశంలో వన్యప్రాణుల రక్షణకు వన్యప్రాణి (సంరక్షణ) చట్టం, 1972 వెన్నెముక వంటిది. మారుతున్న కాలానికి అనుగుణంగా ఇందులో కీలక సవరణలు చేశారు:

**కఠినమైన జరిమానాలు:** 2022-26 మధ్య అమల్లోకి వచ్చిన నిబంధనల ప్రకారం, వేటగాళ్లకు ఇచ్చే జరిమానాలను భారీగా పెంచారు. షెడ్యూల్ 1 జంతువుల వేటపై 25 లక్షల వరకు జరిమానా విధించే అవకాశం ఉంది.

**CITES అమలు:** అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందాల (CITES) ప్రకారం అరుదైన వస్తువుల అక్రమ రవాణాను అడ్డుకోవడానికి కేంద్రం ప్రత్యేక మేనేజ్‌మెంట్ అథారిటీని ఏర్పాటు చేసింది.

**షెడ్యూల్స్ హేతుబద్ధీకరణ:** గతంలో ఉన్న ఆరు షెడ్యూల్స్ స్థానంలో ఇప్పుడు నాలుగు షెడ్యూల్స్ మాత్రమే ఉన్నాయి. ఇది చట్టాన్ని అర్థం చేసుకోవడానికి, అమలు చేయడానికి అధికారులకు సులభతరం చేస్తుంది.

1972లో పులులను కాపాడుకోవడానికి ఏర్పాటు చేసిన ప్రాజెక్ట్ టైగర్ ఇప్పుడిప్పుడే కొంత ఆశాజనకమైన ఫలితాలను ఇస్తుండటం కొంత ఆశాజనకమైన పరిణామం. దంతాల కోసం ఏనుగుల వేట విచ్చలవిడిగా సాగడంతో ఏనుగుల మనుగడకు ముప్పు వాటిల్లే పరిస్థితులు తలెత్తిన నేపథ్యంలో 1992లో ప్రభుత్వం ప్రాజెక్ట్ ఎలిఫెంట్‌ను ప్రారంభించింది. అదే రీతిలో మొసళ్లు, తాబేళ్ల పరిరక్షణ కోసం ప్రత్యేకమైన ప్రాజెక్టులను ప్రారంభించింది.

అంతరించిపోతున్న వన్య జీవుల పరిరక్షణ నిమిత్తం దేశంలో 103 జాతీయ పార్కులను 500 పైగా అభయారణ్యాలను 18 బయోస్ఫియర్ రిజర్వులు,

49 టైగర్ రిజర్వులు, 32 ఎలిఫెంట్ రిజర్వులు ఏర్పాటు వాటి పరిరక్షణ కోసం ఏర్పాటు చేయడం జరిగింది. వన్యప్రాణి సంరక్షణలో భారతదేశం ప్రస్తుతం ప్రపంచానికి నాయకత్వం వహిస్తోంది. ముఖ్యంగా 'బిగ్ క్యాట్స్' (పెద్ద పులులు, సింహాలు, చిరుతలు) సంరక్షణలో మన దేశం సాధించిన ప్రగతి అమోఘం. స్థూలంగా చూసుకుంటే దేశంలోని 5.1 శాతం భూభాగాన్ని- 1.65 లక్షల చ.కి. విస్తీర్ణాన్ని మన ప్రభుత్వం వన్యప్రాణుల రక్షణ కోసం ఉపయోగిస్తోంది. ప్రపంచంలోని దాదాపు 60 శాతానికి పైగా జీవ వైవిధ్యానికి ఆశ్రయం కల్పిస్తున్న పదిహేడు దేశాలలో భారత్ ఒకటిగా నిలిచింది. ఐక్యరాజ్య సమితి నిర్దేశించిన ప్రపంచ సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను చేరుకోవడానికి 2030 నాటికి భూమ్మీద మనుగడ సాగిస్తున్న వాటిలో ప్రమాదం అంచుల్లో ఉన్న 30 శాతం జీవ జాతులను కాపాడుకోవాలని, 2050 నాటికి అంతరించిపోయే స్థితిలో ఉన్నవాటిలో 50 శాతం జీవజాతులను రక్షించుకోవాలని పారిస్ సదస్సులో పాల్గొన్న 'నేషనల్ జాగ్రఫిక్ సొసైటీ' ఇచ్చిన పిలుపు మేరకు భారత్‌లో పటిష్ట చర్యలు తీసుకోవడానికి కార్యాచరణ ప్రారంభం చేసింది.

ఇన్ని సంరక్షణ చర్యలు చేపడుతున్నప్పటికి కూడా, ప్రపంచంలో చాలా చోట్ల మాదిరిగానే మన దేశంలోనూ వన్యప్రాణుల మనుగడకు పూర్తి భరోసా ఇచ్చే పరిస్థితులేమీ లేవు. ఎందుకంటే రాబోయే దశాబ్దాల్లో అన్ని జీవ జాతులలో నాలుగింట ఒక వంతు అంతరించిపోయే ప్రమాదం ఉందని తాజాగా ఓ సర్వే అంచనా వేసింది. దీంతో మానవజాతి మనుగడ కూడా ప్రమాదంలో పడిపోతుందని పర్యావరణ శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



మనుషులు అడవులను అడ్డగోలుగా ఆక్రమించుకోవడం, ఎన్ని నిషేధాజ్ఞలు అమలులో ఉన్నా వన్యప్రాణులను యథేచ్ఛగా వేటాడటం, ఖనిజ తైల ఇంధనాలను, రసాయనిక ఎరువులు, పురుగుమందులను యథేచ్ఛగా వాడటం వంటి చర్యలతో ప్రకృతి సమతుల్యత గతి తప్పి వన్యప్రాణుల మనుగడకు ప్రమాదం కలుగుతోంది. ఇటువంటి క్లిష్ట పరిస్థితుల్లో ఎప్పటికప్పుడు వన్యప్రాణుల పరిస్థితులు అంచనా వేస్తూ వాటిని కాపాడుకోవడానికి కృషి చేయాలి. ప్రకృతి వైపరీత్యాల వలన వన్యప్రాణులకు జరిగే నష్టాన్ని మనం ఎలాగూ భర్తీ చేయలేం. అలా అని మన విధానాలను మార్పు చేసుకోలేకపోతే మాత్రం మన ముప్పును మనమే కొని తెచ్చుకుంటున్నవాళ్లం అవుతాం. వీటిని సవరించుకోకపోతే అతి సమీపంలోనే మన కళ్ళ ముందే మరెన్నో జీవ జాతులు అంతరించిపోవడం ఖాయం. ఇదే పద్ధతి కొనసాగితే ఏర్పడే నష్టం అణు యుద్ధంతో వచ్చే నష్టంతో సమానమని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఒకసారి ఒక జాతి అంతరించిపోయింది అంటే ఎట్టి పరిస్థితులలో అట్లాంటి జాతిని పుట్టించడం అసాధ్యం. అప్పుడు జీవ వైవిధ్యానికి తీవ్ర హాని జరుగుతుంది.వాటిని కాపాడుకోవడం పౌరులందరి బాధ్యత అని గ్రహించిన నాడు ఇప్పుడు ఉన్న వన్య జీవులు నైనా మనం కాపాడుకున్నవాళ్ళం అవుతాం. ప్రపంచంలో జీవ వైవిధ్యం సజావుగా ఉంటేనే భూమ్మీద మనుషుల మనుగడ సజావుగా ఉంటుంది. మన మనుగడకు మూలంగా నిలిచే జీవ వైవిధ్యాన్ని మనమే నాశనం చేస్తున్నాం. జీవ వైవిధ్యాన్ని కాపాడే వన్యప్రాణులు ఒక్కొక్కటీ కనుమరుగై పోతున్న స్థితిలో ప్రపంచ వ్యాప్తంగా మానవ మనుగడ ఈరోజు ప్రశ్నార్థకంగా నిలచింది. 150 సంవత్సరాలు జీవించే తాబేళ్లు కూడా బతకలేని స్థితి ఏర్పడింది.

హై ఓల్టేజ్ విద్యుత్ తీగల వల్ల ఎన్నో పక్షులు చనిపోతున్నాయి. దీనిని బట్టి ప్రకృతికి, ప్రాణుల రక్షణకు చట్టాల రూపకల్పన చేసి చేతులు దులుపుకుంటే మాత్రం ఎప్పటికీ రక్షణ కల్పించలేం. ప్రభుత్వాలు వన్యప్రాణుల పరిరక్షణ కోసం ఎన్ని కార్యాచరణ ప్రణాళికలను రూపొందించుకుని, అమలులోకి తెచ్చినా, ఖనిజ ఇంధన వినియోగాన్ని గణనీయంగా తగ్గించకుండా జీవ వైవిధ్యాన్ని దీర్ఘకాలంలో కాపాడుకోవడం సాధ్యం కాదని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఖనిజ ఇంధనాల వినియోగాన్ని గణనీయంగా తగ్గించుకోవడమే కాకుండా, విరివిగా అడవుల పెంపకం, రసాయన వ్యర్థాలను నదులు, సముద్రాల్లో కలపకుండా జాగ్రత్త పడటం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించుకోవడం వంటి చర్యలను చిత్తశుద్ధితో చేపడితే తప్ప జీవజాతులను కాపాడుకోలేమని శాస్త్రవేత్తల అభిప్రాయం. మనల్ని మనం కాపాడుకోవడమే కాదు. భావితరాల వారి ప్రయోజనాలను భగ్నం చేసినవాళ్ళం అవుతాం. ఇప్పటికైనా పౌరులందరూ కూడా మూగ జీవాల రక్షణను తమ బాధ్యతగా గుర్తిస్తే వన్యప్రాణుల సమగ్ర రక్షణ సాధ్యమవుతుంది.మానవ మనుగడ కొనసాగుతుంది. ఇవి ఇలా కొనసాగిస్తూనే ప్రపంచ సుస్థిరాభివృద్ధి లక్ష్యాలైన 2030 నాటికి భూమ్మీద మనుగడ సాగిస్తున్న వాటిలో ప్రమాదం అంచుల్లో ఉన్న 30 శాతం జీవ జాతులను కాపాడుకోవాలి. 2050 నాటికి అంతరించిపోయే స్థితిలో ఉన్నవాటిలో 50 శాతం జీవజాతులను రక్షించుకోవాలి.. అనే పారిస్ సదస్సు తీర్మానాన్ని ప్రభుత్వాలు చిత్త శుద్ధితో అమలు పరిచిననాడు జీవ వైవిధ్యం నిలబడుతుంది.. జీవుల మనుగడ కొనసాగుతుంది. ✦

# 'వాయిదా' వేయకండి!

మనలో అందరికీ ఎంతో కొంత వాయిదా వేసే గుణం సహజంగానే ఉంటుంది. అనవసరమైన విషయాల్లో కాలయాపన చేస్తూ, అసలైన పనులను లేదా లక్ష్యాలను అలక్ష్యం చేస్తూ, రేపటికి వాయిదా వేస్తూ ఉండడం సర్వ సాధారణంగా జరుగుతున్నది. టివీ చూస్తూనే, స్మార్ట్ ఫోన్‌లో తలదూర్చుతూనో, మిత్రులతో పిచ్చాపాటి మాట్లాడుతూనో, అతి నిద్ర పోతూనో మనం మన చదువులను, చేయవలసిన పనులను లేదా అందుకోవలసిన గమ్యాలను కొన్ని నిమిషాలు, గంటలు, రోజులు, నెలలు, సంవత్సరాలు వాయిదా వేస్తూ ఉంటాం. ఇలా "తరువాత చేద్దాం లే" అనే ఆలోచన ఒక దురలవాటుగా మన మనసుల్లో దూరిపోతుంది. ఇది దీర్ఘకాలిక దురలవాటుగా మారితే మనం చేరుకోవాల్సి గమ్యాలకు దూరం అవుతూ వైఫల్యాలను ప్రతిఫలాలుగా తీసుకోవలసి వస్తుందని మరిచిపోతాం. మనం నిర్దేశించుకున్న లక్ష్యాలను, బాధ్యతలను, చదువులను, నిర్ణయాలను పక్కన పెట్టి అనవసర, ప్రాధాన్యం లేని పనుల్లో కాలయాపన చేయడాన్ని 'వాయిదా వేసే తత్వం'గా పిలుస్తాం.

వాయిదా వేసే దుర్గుణం పెరిగితే వ్యక్తి ఎదుగుదల ఆగిపోవడం, జీవితం నిస్సారం కావడం సహజంగా జరుగుతాయి. దాదాపు 70 శాతం మంది యువతకు ఈ 'వాయిదా రోగం' ఉందని అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి.

## దుష్ఫలితాలు

వాయిదా వేసే దుర్గుణాలతో జీవితంపై తీవ్రమైన ప్రతికూల ప్రభావం పడడం, జీవితంలో అపజయాలు మూటకట్టుకోవడం జరుగుతుంది. ఈ దురలవాటు వల్ల మన భవిష్యత్తు, ఆరోగ్యం, పేరు ప్రతిష్టలు, ఉత్పాదకత లాంటివి దెబ్బతింటాయి. సరైన సమయానికి సరైన పనులు చేయకపోవడంతో గడువు దగ్గర పడుతున్నకొద్దీ మానసిక ఒత్తిడి పెరుగుతూ ప్రతికూల భావోద్వేగాలకు, శారీరక అనారోగ్యాలకు లోనవడం జరుగుతుంది. ఈ దురలవాటు వల్ల అందివచ్చిన అవకాశాలు చేయి జారడం, లక్ష్యాలకు దూరం కావడం, ఓటమిని మూట కట్టుకోవడం వంటివి జరుగుతాయి. చివరి నిమిషంలో పనులకు ఉపక్రమించడంతో పనిలో నాణ్యత లోపిస్తుంది. వాయిదా వేసే గుణం కలిగిన ప్రబుద్ధులకు సమాజంలో చెడ్డ పేరు, మానవ సంబంధాలు సన్నగిల్లడం, అందరి అంగీకారం లేకపోవడం, ఆందోళన పెరగడం వంటివి జరుగుతాయి. దీర్ఘకాలం వాయిదాలు కొనసాగితే శారీరక పటిష్టత, నిద్ర, వ్యక్తిగత శ్రద్ధ, పనిలో ఏకాగ్రతలు సడలిపోతాయి.



## తీసుకోవలసిన జాగ్రత్తలు

వాయిదా వేయడం అనే దురలవాటుకు కారణాలుగా స్వయం ప్రేరణ కొరవడడం, వైఫల్యం అవుతామనే భయం, సమయపాలనలో నియంత్రణ కొరవడడం, తాత్కాలిక సుఖాలకు లొంగిపోవడం, పొరపాటు జరుగుతుందేమో! అనే అనవసరమైన ఆందోళనలు లాంటివి గుర్తించబడ్డాయి. వాయిదా వేసే తత్వం నుంచి బయట పడడానికి మనం చేయవలసిన పనులను చిన్న చిన్న భాగాలుగా విభజించుకోవడం, సరైన సుసాధ్యమైన లక్ష్యాలను మాత్రమే నిర్ణయించుకోవడం, చేయవలసిన పనులను ప్రాధాన్యతా క్రమంలో పెట్టుకోవడం, ప్రతి పనికి అవసరమైన సమయం మాత్రమే కేటాయించుకోవడం, ఏకాగ్రత సడలకుండా చూసుకోవడం, నీకు నువ్వే జవాబుదారీతనాన్ని ప్రదర్శించడం, సకాలంలో పూర్తి చేసిన పనుల నుంచి మానసిక సంతృప్తిని పొందడం లాంటివి కొనసాగించాలి.

వాయిదా వేసే గుణం అందరికీ ఉన్నప్పటికీ కొందరు ఆ గుణాన్ని తగ్గించుకుంటూ, తమను తాము హెచ్చరికలు చేసుకుంటూ, లక్ష్యాలను సకాలం అందుకుంటూ, వ్యక్తిగత ఎదుగుదల సాధించుకుంటూ, తక్కువ సమయంలో ఎక్కువ పనులను చేసుకుంటూ, మానసిక ఆరోగ్యంతో ముందడుగు వేస్తూ, జీవితంలో ఎదురయ్యే జయాపజయాలను సమానంగా తీసుకుంటూ, అపజయాలను విజయవంతంగా అధిగమిస్తూ, సమాజ మార్గనిర్దేశనం చేసే స్థాయికి ఎదుగుతూ, జీవితాన్ని ఆసాంతం ఆస్వాదించడం అలవాటు చేసుకుంటారు. నేటి నుంచే వాయిదా వేసే ఆలోచనలకు స్వస్తిపలుకుదాం. ఏ సమయంలో ఏ పని ఎలా పూర్తి చేయాలో తెలుసుకొని మసలుకుందాం. మనదైన ఒకే జీవితాన్ని ఒడుపుగా, విజయవంతంగా, అమృతమయంగా ఆసాంతం ఆస్వాదిద్దాం.

– డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి

సింగిల్ పేజీ కథ

# మౌనం వీడిన మాట

"చాలా హుషారుగా ఉన్నావు ఈ వేళ, శాంత ఫోన్ చేసిందా?" అని అడిగింది అచ్చమ్మ. "అంటే నేను భార్య ఫోన్ చేస్తేనే ఇలా ఉంటానా? అది మాట్లాడకపోయినా నేనే ఫోన్ చేస్తాను?" అంటూ అన్ని రూములు కలియదిరుగుతున్నాడు. అతను ఆ ఆశ్రమంలో దాదాపు పది సంవత్సరాల నుండి పనిచేస్తున్నాడు. భార్య బతుకు దెరువుకు బయట గల్ఫ్ దేశానికి వెళ్ళింది. పిల్లల్ని తన తల్లి చూసుకొని చదివిస్తోంది.

మోయలేని వయసు భారమున్నవాళ్ళు పదుల సంఖ్యలో ఉన్నారు అక్కడ. ఆ నిర్వాహకులు ఎవరో, ఎక్కడుంటారో? ఎవ్వరికీ తెలియదు. అలా తెలియనీయాల్సిన అవసరం ఇంతవరకు రాలేదు.

చక్కటి వాతావరణం, మంచి గాలి వెలుతురు ఉండే గదులు, ఆహారం సమయానికి అందించడం, అనారోగ్యం పాలైతే మంచి డాక్టర్ మందులు కూడా ఆయనే తెస్తాడు. అక్కడున్న వాళ్లంతా అనాథలు కాదు. పిల్లలు ఉండి కూడా వాళ్ళు చూసుకోలేనివాళ్ళు. ఎవరినీ తప్పు పట్టలేం ఎందుకంటే పరిస్థితులు అలాంటివి.



................

రాజశేఖర్ ఆఫీసుకు బయలుదేరబోతున్నాడు. ఇంతలో ఎదురుగా వచ్చింది తన భార్య జీవిత. ఇద్దరి మధ్య మాటలు సరిగా లేవు. అలాగని అతను భార్యను వేధించడం లేదు. ఆమెకు, ఇంటికి ఏమి కావాలో కొదవ లేకుండా సమకూరుస్తాడు. ఇదంతా గత ఇరవై సంవత్సరాల నుండి కొనసాగుతోంది. వయస్సు యాభై దాటుతోంది అతనికి. పెళ్లైన తర్వాత ఇంట్లో భార్య, తల్లి మధ్య మాటల మనస్పర్ధలు మొదలైనాయి. అన్నీ ఉండీ చిన్న చిన్న విషయాలకు మనసు పాడుచేసుకోవడం ఏమిటని విసుగు చెందేవాడు రాజశేఖర్. బతికి ఉన్నప్పుడు ఆమెను సరిగా చూసుకోలేదు. ఆమె తదనంతరం ఏమి మాట్లాడక పోవడమే తాను తన తల్లి పట్ల చేసిన తప్పుకి పరిహారం అనుకున్నాడు. తాను చేసిన తప్పుకి ఇలా జీవితాంతం శిక్ష అనుభవించి రావడం వల్ల కుమిలిపోతోంది జీవిత. పిల్లలు లేని జీవితం కూడా దీనికి తోడయింది వాళ్లకు.

................

ఓ రోజు అనుకోకుండా వృద్ధాశ్రమం నుండి పిలుపు వచ్చింది రాజశేఖర్‌కు "సార్, మా ఆశ్రమంలో చాలా మంది వృద్ధులు ఉన్నారు. వారికి జీవిత చివరి దశలో ఆహారంతో పాటుగా కొంత మంది బయట వ్యక్తుల పలకరింపులు కూడా అవసరం అవుతాయి. అందుకే మీరు తప్పక మా ఆశ్రమ వార్షికోత్సవానికి రావాలి" అంటూ పిలుపు వచ్చింది. తనకు ఎందుకో వెళ్ళడానికి ఇష్టం లేదు. అక్కడున్న వాళ్లతో మాట్లాడితే తన తల్లిని గుర్తుచేసుకోవచ్చన్న అభిప్రాయం ఏర్పడింది ఆయనకు. వస్తానని మాట ఇచ్చాడు. అనుకున్న సమయానికి అక్కడికి వెళ్ళాడు. అక్కడంతా పండగ వాతావరణం. ఆశ్రమంలో ఉన్నవాళ్ళందరూ మంచి బట్టలు కట్టుకున్నారు, ముఖాల్లో చిరునవ్వు ఉంది, తాము ఒంటరి అన్న భావన వాళ్లలో కనపడలేదు. పెద్ద వేదిక ముందు ఒక వైపు అక్కడి పెద్ద వాళ్ళు, మరొక వైపు కాలేజీ పిల్లలు ఉన్నారు. రాజశేఖర్‌ను లోనికి తీసుకువెళ్తున్న అతన్ని "ఇక్కడికి పిల్లలను కూడా ఎందుకు పిలిచారు?" అన్నాడు.

"ఇక్కడి పరిస్థితులు వాళ్లకు తెలియాలని" అన్నాడు, అతను. "దీని నిర్వాహకుల గురించి చెప్పలేదు" అన్నాడు.

"సార్, ఈ రోజు వరకు ఇక్కడి వాళ్లకు కూడా ఈ ఆశ్రమ నిర్వాహకుల గురించి తెలియదు, ఇప్పుడు వారు కూడా ఇక్కడి వస్తున్నారు" అన్నాడు.

............

సభ మొదలైంది.. మేనేజర్ అందర్నీ పరిచయం చేసి వేదికపైకి పిలిచాడు. చివరన మీరు ఇప్పటి వరకు చూడని మన ఆశ్రమ నిర్వాహకురాలిని చూడబోతున్నారు అంటూ వేదికపైకి పిలిచాడు. ఆమె వేదిక పైకి రాగానే రాజశేఖర్ ఆశ్చర్యపోయాడు. ఇది నిజమా? అబద్ధమా? తేల్చుకోలేని స్థితిలోకి వెళ్ళిపోయాడు. అక్కడున్నది ఆయన భార్య జీవిత.

జీవిత మైక్ అందుకొని "నేను జీవితంలో చాలా పెద్ద తప్పు చేసాను, ఆ తప్పు ఇప్పుడు ఇక్కడున్న వాళ్లలో ఒకరికి మాత్రమే తెలుసు. ఆ తప్పు నేను సరిదిద్దుకోలేనిది. దానికి ఏ రకంగా ప్రాయశ్చిత్తం చేసినా నేను క్షమించబడను. ఇక్కడకు పిల్లలను ఎందుకు పిలిచామంటే మనం వయసులో ఉన్నప్పుడు ఇంట్లో పెద్దవాళ్ళు చెప్పే మాటలు మనకు చాలా మూర్ఖంగా ఉంటాయి. మన ఎదుట ఉన్నప్పుడు వాళ్ళ విలువ మనకు తెలియదు. వాళ్ళు దూరమయ్యాక మనం సరిచేసుకుందామనుకున్నా అది వీలుకాదు" అంటూ కాసేపు మాట్లాడింది.

రాజశేఖర్ లేచి ఇన్నాళ్ల తన మౌనాన్ని వీడి "నిర్వాహకులకు అభినందనలు" అంటూ చిరునవ్వుతో ముగించాడు.


– సింగంపల్లి శేష సాయికుమార్

# 'సుమతీ' 'వేమన' పద్య సంపద

శతకం అంటే నూరు పద్యాల సంపుటి. ప్రతీ పద్యం చివర మకుటం వుండటం శతక నియమం. వేద కాలంలోనే శతక సంఖ్యకు ప్రాముఖ్యం వుండేది. ప్రాకృతంలో హాలుని పేర సప్తశతి, సంస్కృతంలో భర్తృహరి సుభాషితాలు, మయూరుని సూర్య శతకం వంటి సుప్రసిద్ధ రచనలను అనుసరించి తెలుగులో శతక వాఙ్మయం బయలుదేరింది. భక్తి, శృంగార, నీతి, వైరాగ్య భావనలతో శతకాలు లఘు కావ్యాలుగా, ముక్త కావ్య ప్రక్రియకు చెంది వున్నాయి.

శివకవి పండితారాధ్యుడు రాసిన శివతత్త్వం సారం శతకం అని, పాల్కురికి సోమన పేర్కొన్నాడు. తెలుగులో సంపూర్ణ శతక లక్షణాలున్న మొదటి శతకం సోమనాథుని వృషాధిప శతకం. తెలుగు శతకాలలో నీతి, వైరాగ్య, భావాలు, భగవత్పరమైన శృంగార, విరహాల వర్ణనలున్నాయి. పురాణేతి హాస కథలను శతక రూపంలో రాయడం తెలుగులో విశేషం. శివ సంబోధనతో మకుటాలున్నాయి. కంద పద్యాలు ప్రధానంగా వుండేవి. తెలుగులో మొదటి శతకంగా గుర్తింపబడిన శివతత్త్వ సారంలో శైవ సిద్ధాంతాలు, ఆచార వ్యవహారాలు, శివభక్తుల కథలు, మహిమలున్నాయి.

శతక పద్యాలు భావ పరిపూర్ణతతో పాఠకునికి భావరస స్ఫూర్తి కలిగిస్తాయి. కవి ఆత్మానుభూతికి ఎక్కువ స్థానం వుంటుంది. ప్రాచీన సాహిత్యంలో ఆత్మాశ్రయ కవిత్వానికి శతకాలు ఉదాహరణలు. తెలుగులో కవులంతా శతకాలు రాసినవారే. సుమారుగా 12వ శతాబ్ద కాలంలో వృషాధిప, సర్వేశ్వర శతకాలు క్రమేపీ ధూర్జటి కాళహస్తీశ్వర శతకం 18,19వ శతాబ్దాలలో కుక్కుటేశ్వర(కూచిమంచి తిమ్మకవి) భర్తృహరి (ఏనుగు లక్ష్మణకవి) భాస్కర, సుమతి, రఘువీర, దాశరథీ, నారసింహ, బాలగోపాల శతకాలు ప్రసిద్ధమయ్యాయి.



తెలుగు శతకాలు విశిష్ట లక్షణాలు కలిగి వుండేవి. ఛందస్సు, మకుట నియమాలున్నాయి. శృంగార భావనలు వున్నా భగవత్పరంగా వుండేవి. వందల వేల సంఖ్యలో శతకాలు రాయబడ్డాయి. ప్రత్యేకంగా తెలంగాణలో శరభాంక లింగ శతకం, నరసింహ శతకం(ధర్మపురి శేషాచల కవి) శ్రీకృష్ణ శతకం (కౌకుత్స నరసింహదాసు) సుమతీ శతకం(బద్దెన మహాకవి) ఎన్నో ప్రశస్తమైన శతకాలు తెలుగు చూసాయి. వేములవాడ భీమకవి ఒక సుమతీ శతకం రాసినట్టుగా కూచిమంచి తిమ్మకవి తన సర్వ లక్షణ సార సంగ్రహంలో ఉదహరించాడు. 'సుమతీ' అనే జైనముని శతకాన్ని రాసాడనే అభిప్రాయం కూడా వుంది. నీతిశాస్త్ర ముక్తావళి రచించిన వేములవాడ చాళుక్యరాజు రెండో బద్దెన, సుమతీ శతకాన్ని రాసాడు. కాబట్టి సుమతీ శతకం వేములవాడ చాళుక్యుల కాలంనాటి రచనగా తెలుస్తోంది.

'సుమతీ' అనే సంబోధనతో చదువరులను "మంచి బుద్ధి కలవారిగా" ఎంచి, కంద పద్యాలుగా సుందరమైన శైలి, సూటి భావాలతో నీతిబోధకంగా సరళ సులభంగా రాయబడటంతో నాడూ-నేడూ కూడా ఈ శతకం విశేష ఆదరణ పొందుతోంది. అపార లోకజ్ఞానం వున్న కవి, లోకరీతి, మానవ స్వభావ నైజాన్ని, నిత్యజీవన సత్యాలను యింత అద్భుతంగా కాలానికి అతీతమైన జ్ఞానాన్ని ఉపమాలంకార సరళితో అందించారు. "శ్రీరాముని దయచేతను"తో ఆరంభమైన ఈ శతక పద్యాలు, తెలుగు వారి జనజీవన చైతన్యంలో భాగమయ్యాయి. అప్పిచ్చేవాడు, వైద్యుడు, ఎప్పుడూ ప్రవహించే నది బతకటానికి అవసరమని, అవసరానికి ఆదుకోని చుట్టాన్ని, మొక్కినా వరం యివ్వని దేవున్ని వెంటనే విడిచిపెట్టమని, సంపద కరి మింగిన వెలగపండు లాంటిదని, బలవంతమైన సర్పం కూడా చలిచీమల చేత చిక్కి చస్తుందని, చీమలు పెట్టిన పుట్టలు పాములకు నివాసం అవుతాయని ఎన్నో సత్యాలను సుమతీ శతకకారుడు వందలాది పద్యాలుగా అందచేసారు.

వేములవాడ చాళుక్యుల కాలంలోని బద్దెనకు బ్రిటిష్ పాలనా కాలంనాటి వేమనకు పొంతన లేకపోయినా, కాలం గడిచినా, వేమన శతకాల పద్యాలు తెలుగు ప్రజల నాలుకల మీద నాట్యమాడుతున్నాయి. 'విశ్వదాభిరామ వినురవేమ' అనే మకుటంతో అంతమయ్యే వేమన పద్యాలు జీవితం అంతా సమస్త జీవితానుభవాలను చవిచూసిన జగమెరిగిన వేదాంతిగా తెలుగు సాహిత్య లోకాన్ని సిరాశాసనం చేసాయి.

తెలుగు సాహిత్య చరిత్రలో నాటి పండితలోకం అసలు కవిగానే గుర్తించని వేమన తెలుగుజాతి నిత్య జీవితంలో ఊపిరిలో ఊపిరిగా కలిసిపోయారు.

వేమన పండితుడు కాదు. తనకు తెలియకుండానే అద్వైతార్థనాలను ఆటవెలది పద్యాలలో తెలుగు వారికి అందించారు. జీవితానుభవాలే వేమనకు అద్వైతం బోధించాయి. వేమన 15వ శతాబ్దానికి చెందినవాడు.

వేమన తాను కవి అవటానికి ప్రయత్నించలేదు. కనీసం శతక సంపదనైనా రక్షించుకొనే విజ్ఞత ప్రభుత్వ, ప్రైవేటు విద్యా విధానాలలోను, తెలుగునాట, తల్లిదండ్రుల అభీష్టం కావాలని ఆశిద్దాం.

**- యద్రమిల్లి**

# అవిసె గింజలతో ఆరోగ్యం

ఆధునిక లైఫ్ స్టయిల్ అలవాట్ల వల్ల ఆరోగ్యాన్ని కాపాడుకోవడమనేది ఒక పెద్ద సవాలుగా మారిందనే చెప్పాలి. సహజ ఆరోగ్య ఉత్పత్తుల్లో ఎక్కువగా ఉపయోగించే సూపర్‌ఫుడ్‌లో అవిసె గింజలు ముఖ్యమైనవి. ఎందుకంటే వీటిలో ఉండే పోషకాలు మన శరీర అవసరాలకి సరిపడా ఉండడమే కారణం. అవిసె గింజలు సాధారణంగా చదునుగా, అండాకారంగా ఉండి కోణాల చివరలతో ఉండి మృదువైన నిగనిగలాడే ఉపరితలాన్ని కలిగి ఉంటాయి. ఇవి ముదురు గోధుమ రంగు నుండి పసుపు రంగు వరకు ఉంటాయి.

భారతదేశంలో వీటిని ఎక్కువగా మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, బీహార్‌లలో సాగు చేస్తారు. అవిసె మొక్కలోని దాదాపు అన్ని భాగాల్ని వివిధ ప్రయోజనాల కోసం ఉపయోగిస్తారు. వీటిని తెలుగులో ఉలుసులు, అతశీ, మదనగింజలు, అల్సి అని ఇంగ్లీషులో 'ఫ్లాక్స్ సీడ్స్' సీడ్స్, లీన్సీడ్స్, జావస్, పెషి, అగిసె, తిషి, ఆవలి, తిషి, అగసె, ఆవలిలిత్రై, అల్సికీ బీజ్, కామన్‌ఫ్లాక్స్, అటాసి అని వివిధ పేర్లతో వ్యవహరిస్తారు. దీని శాస్త్రీయనామం లైనం ఉసితే టిస్సిమమ్. దీని అర్థం చాలా ఉపయోగం అని. ఇది లినసే కుటుంబానికి చెందినది. చల్లని ప్రాంతాల్లో విస్తారంగా పెరిగే ఒక ఆహార పీచు పంట అవిసె. అవిసె నార మొక్క కాండం నుండి తీసుకుంటారు. ఇది పత్తి కంటే రెండు మూడు రెట్లు బలంగా, మృదువుగా పొడవుగా ఉంటుంది. దీన్ని చైనా, ఈజిప్ట్‌లలో పురాతన కాలం నుండే సారవంతమైన ప్రాంతాల్లో పండించేవారు. క్రీ.పూ. 3 వేల సంవత్సరాల నాటికే అవిసెని ఉపయోగించినట్లు ఆధారాలున్నాయి. యూరప్ ప్రాంతంలో అవిసెనార నుండి బట్టలు తయారు చేసేవారు. ఇది మధ్యధరా ప్రాంతం నుండి కెనడా అమెరికా, రష్యా, పాకిస్తాన్, బ్రెజిల్, అర్జెంటినా ద్వారా ప్రపంచమంతటా వ్యాపించింది. ఇది మానవ నాగరికతతో పాటు పెరిగిన ఒక ప్రకృతిసిద్ధమైన పురాతన పంట.

## రెండు రకాలు

**గోధుమ రంగు అవిసె గింజలు:** ఇవి సర్వసాధారణంగా సులభంగా మార్కెట్‌లో దొరుకుతాయి. ఇవి కొంచెం ఘాటైన, వేయించిన రుచిని కల్గి ఉంటాయి.

**బంగారు రంగు అవిసె గింజలు:** ఇవి పసుపు రంగులో ఉండి తేలికైన వెన్నలాంటి రుచిని కలిగి ఉంటాయి. దీనికి కారణం వీనిలోని ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ ఉండటమే.



అవిసె గింజల్లో కేలరీలు, కార్బోహైడ్రేట్స్, ప్రొటీన్స్, ఫైబర్, ఒమేగా, ఆమ్లాలు, కాల్షియం, ఐరన్, పోటాషియం, మెగ్నీషియం, ఫాస్పరస్, సోడియం, విటమిన్ బి 12, విటమిన్ సి, విటమిన్, కోలీన్, నియాసిన్, దయామిన్, జింక్, సెలీనియం, మాంగనీస్, రాగి మొదలైన పోషకాలుంటాయి.

## ఆరోగ్య ప్రయోజనాలు

– చేపలు, నాన్‌వెజ్ తినని వారికి అవిసె గింజల్లోని ఉత్తమ ఒమేగా 3 ఫ్యాటీ ఆసిడ్స్ ఉపయోగపడతాయి.

– అవిసెగింజలు ఫైటో ఈస్ట్రోజెన్‌ల్ని (లిగ్నాన్స్) కలిగి ఉండడం వల్ల ఆడవారిలో వచ్చే బహిస్టులోపాలకిది మంచిది. అవిసెగింజల్లో ఫినోలిక్ సమ్మేళనాలు (ఫెరులిక్ ఆమ్లం, క్లోరోజెనిక్ ఆమ్లం, గాలిక్ ఆమ్లం) కేన్సర్‌ని నిరోధించడమే కాకుండా మెటాస్టాటిస్ కేన్సర్ కణతులు, కేన్సర్ ఇతర అవయవాలకి వ్యాపించడాన్ని కొంతవరకు అరికడతాయి.

– వీటిలో నీటిలో, కొవ్వులో కరిగే విటమిన్లని కల్గి ఉండడంవల్ల కొవ్వుని ఆక్సీకరణం నుండి రక్షించే యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేసి మూత్రంలో సోడియం విసర్జనని ప్రోత్సహిస్తుంది.

– ఆసియాలో వేల సంవత్సరాలుగా ఆయుర్వేద సిద్ధ యునాని వైద్యంలో కూడా వీటిని ఉపయోగిస్తున్నారు.

– అవిసె గింజల్ని విత్తనాలు, నూనెలు, పొడిమాత్రలు, గుళికెలు, పిండి రూపంలో ఎక్కువగా ఉపయోగిస్తారు.

3–4 మి.మీ.పొడవుగల అవిసె గింజలు ఫైబర్, శ్లేష్మం రెండిటిని కల్గి ఉండడం వల్ల జీర్ణక్రియల్ని మెరుగుపర్చి మలబద్ధకం లేకుండా మలవిసర్జన సాఫీగా జారీ అయ్యేలా చేస్తుంది.

– వీటిలోని సైనోజెనిక్, గ్లైకోసైడ్స్, కాడ్మియం, ట్రిప్సిన్ ఇన్హిబీటర్లు, ఫైటిక్ ఆమ్లం వంటి యాంటీ న్యూట్రియెంట్స్ వల్ల శరీరానికి అవసరమైన పోషకాలు లభ్యమవుతాయి.

– వీటిలోని ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలు చెడు కొలెస్ట్రాల్‌ని తగ్గించి, రక్తపోటుని అదుపులో ఉంచడం వల్ల గుండెపోటు వచ్చే ప్రమాదాన్ని నివారించవచ్చు.

– దీనిలో కరిగే ఫైబర్ 25 శాతం వుంటే, కరగని ఫైబర్ 75 శాతం ఉండడం వల్ల ఎక్కువసేపు ఆకలి వేయదు. బరువు నియంత్రణలో సహాయపడతాయి. హార్మోన్ల అసమతుల్యతతో బాధపడేవారికిది మంచి ఉపశమనం కలిగిస్తుంది.

– ఈ గింజలు చర్మాన్ని తేమగా, ఆరోగ్యంగా ఉంచుతాయి. జుట్టు రాలడాన్ని తగ్గించి బలాన్నిస్తాయి. దీనిలోని యాంటీ ఆక్సిడెంట్స్ వల్ల దద్దుర్లు, రాషెస్, మొటిమలు వంటి చర్మవ్యాధులు రావు,


– ఎలర్జీ ఉన్నవాళ్లకు మంచిది. దీనిలోని ఒమేగా3 కొవ్వు ఆమ్లాలు శరీరంలో జరిగే జీవక్రియలో సులభంగా కరిగిపోవడం వల్ల నరాలకి తక్షణశక్తిని కల్గించి అలసట, నీరసాన్ని తగ్గిస్తాయి.

– అవిసె గింజల్లో చక్కెర స్థాయిల్ని తగ్గించే గుణం కలిగి ఉండడమే కాకుండా ఇన్సులిన్ నిరోధకతని కూడా తగ్గించడం విశేషం.

– అవిసె గింజలు వాడే వారిలో ధమనులలో క్రొవ్వు చేరదు. దీన్ని ఎథిరోస్క్లోరోసిన్ వ్యాధి అంటారు. దీని నివారణలో అవిసె గింజల్ని మించినది లేదనే చెప్పాలి.

– స్త్రీలలో వచ్చే రొమ్ము, గర్భాశయ కేన్సర్‌లను అవిసెలోని ఫైటో ఈస్ట్రొజెంట్స్ నయం చేస్తాయి. మెనోపాజ్ దశలో కలిగే లక్షణాలకి, అవిసెలోని లెగ్నిన్ పదార్థం ఉపయోపడుతుంది. అలాగే అవిసె గింజల నూనె, జెల్లీలు, మణికట్టు, అరచేయి, వేళ్లలో, కీళ్లలో ఏర్పడే నొప్పులు, వాపుల్ని తగ్గిస్తుంది. ఈ గింజల నుండి తీసిన నూనెని వంటనూనెగాను ఉపయోగిస్తారు. అవిసె గింజల్లో గోధుమరంగువి ఎక్కువ రుచిగా ఉన్నప్పటికి వాటిని ఉడికించి కానీ, వేడి చేసి కానీ తినాల్సి ఉంటుంది.

– వీటిని చూర్ణం, టాబ్లెట్స్, క్యాప్యూల్స్, బిస్కట్స్, పిండి పదార్థాల



తయారీలో కూడా ఉపయోగిస్తున్నారు.

– అవిసె గింజలు ఒక సంవత్సరం వరకు నిల్వ ఉంటాయి. అవిసె గింజల పొడి రిఫ్రిజిరేటర్ ఆరు నెలల వరకు పాడవదు. ఒకవేళ నిల్వచేసిన గింజలు కానీ పొడి కానీ వాసన వస్తే పారవేయడం ఉత్తమం. రోజూ వీటిని పరగడుపున ఒక టేబుల్ స్పూన్ తీసుకుంటే మంచిది. లేదా వీటిని సూప్స్, సలాడ్స్, చపాతీలు, స్మూతీలు, పరోటాల్లో వేసుకుని తినవచ్చు.

## దుష్ప్రయోజనాలు

అవిసె గింజల వల్ల బహుళ ప్రయోజనాలు వున్నప్పటికీ వీటివల్ల కొన్ని దుష్ప్రభావాలు కలుగుతాయి. వీటిని మితంగా తీసుకోవాలి. వీటిని ఎక్కువగా తీసుకోవడం వల్ల కడుపు నొప్పి, మలబద్ధకం, విరోచనాలు, పొట్ట ఉబ్బరం వంటి జీర్ణకోశ సమస్యలేర్పడతాయి.

– అవిసె గింజల్ని ఆహారంతో పాటు తీసుకుంటున్నప్పుడు మంచి నీళ్ళు ఎక్కువగా తీసుకోవాలి. లేకపోతే ఇవి సరిగా జీర్ణం కావు.

– పచ్చి అవిసె గింజలు లేదా బాగా పండని అవిసె గింజలు తినడం ఆరోగ్యానికి మంచిది కాదు. డయాబెటిక్స్ మితంగా తీసుకోవాలి. లేకపోతే ఇవి రక్తంలో చక్కెర స్థాయిల్ని తగ్గిస్తాయి.

– స్త్రీలు గర్భధారణ సమయంలోను, ప్రసవానంతరం ఈ గింజలను తీసుకోరాదు.

– ఇవి చేపలకి ప్రత్యామ్నాయం కాబట్టి ఇవి వెజిటేరియన్స్‌కి శక్తి ప్రదాయిని లాంటివని చెప్పవచ్చు. వీటి పొడిని పెరుగు, స్మూతీస్, ఓట్స్‌లో, ఆమ్లెట్స్, కూరల్లో, శాండ్‌విచ్‌లో కలిపి వాడుకోవచ్చు.

చిరుధాన్యాల్లో ఎంతో ప్రధానమైన వీటివల్ల ఎన్నో రోగాలకి చెక్ పెట్టొచ్చు. ప్రేవుల గట్ హెల్త్‌కు ఇది చాలా మంచివి. ఇరిటబుల్ బవెల్ సిండ్రోమ్, క్రొన్స్ డిసీజ్, అల్సరేటివ్ కొలైటిస్ వంటి జీర్ణకోశ వ్యాధులతో బాధపడేవారికి పేగు కేన్సర్, ప్రొస్టేట్ కేన్సర్ బాధితుల జీర్ణవ్యవస్థ ఆరోగ్యానికి అత్యంత కీలకమైన వీటిని దిని ఆహారంలో భాగం చేసుకోవచ్చు.

– దీనిలోని ప్రొటీన్ కండరాల నిర్మాణానికి, మాంగనీస్ ఎముకల ఆరోగ్యానికి, మెటబాలిజమ్‌ని మెరుగుపర్చడానికి మెదడు ఆరోగ్యానికి కీలకమైన థయామిన్ (బి1) దీంట్లో ఉండడమే కారణం. రక్తాన్ని పల్చగా చేసే మందులు వాడేవారు మితంగా తీసుకోవాలి. అలాగే సిస్టమిక్ ల్యాపస్ ఎరిథిమాటస్ ఉన్నవారిలో మూత్ర పిండాల పనితీరు మెరుగుపడుతుంది. రుచిగల అవిసె గింజల్ని ఉత్పత్తి చేసే దేశాల్లో కెనడా, యుకె ముందంజలో ఉన్నాయనే చెప్పాలి.

– డా॥ కె. ఉమాదేవి

– నీవు చెప్పడానికి ఏమీ లేనప్పుడు మాట్లాడకు. – ఛార్లెస్ కాలెబ్

– భావం దాల్చే వేషమే మాటలు.

– కార్లైల్

– గొప్ప విషాదం మాటలకు అందదు.

కథ

# కథల పుస్తకం

**బడికి** ఎదురుగా ఉన్న పుస్తకాల షాపు వద్ద రకరకాల పుస్తకాలు వేలాడుతున్నాయి. అందులో 'నన్ను చదవండి' అనే కథల పుస్తకం కూడా ఉంది. ఆరవ తరగతి చదివే అరుణ తదేకంగా ఆ పుస్తకాల వైపే చూసింది. ఆమె మనసు కథల పుస్తకంపై పడింది. 'చినిగిన చొక్కా అయిన తొడుక్కో.. ఒక మంచి పుస్తకం కొనుక్కో' అని టీచర్ చెప్పిన విషయం గుర్తుకొచ్చింది. తన స్నేహితులు చాక్లెట్స్ కొనుక్కుని వెళ్లారు. పుస్తకం కొనడానికి అరుణ దగ్గర డబ్బులు లేక నిరాశతో వెళ్లిపోయింది. తనను కొంటారనుకున్న కథల పుస్తకం నిరాశపడింది. తనను కొని విజ్ఞానం, వినోదం పొందుతారని పుస్తకం ఆశ.



పిల్లలు, పెద్దలు చూస్తున్నారు కానీ ఎవరూ కొనడం లేదు. ఇంకో రోజు ఓ యువకుడు వచ్చి పుస్తకాలను చూశాడు. పేజీ పేజీ తిప్పాడు. నన్ను ఈ రోజు కొంటాడని కథల పుస్తకానికి సంతోషం కలిగింది. కానీ ఆ కుర్రాడు సినిమా పత్రిక కొనుక్కొని వెళ్ళాడు. పుస్తకాలకు కోపం వచ్చింది. పాపం ఏం చేస్తాయి వేలాడుతూ వచ్చేవారిని పోయే వారిని చూస్తూ ఉండేవి. ఇలా కొన్ని దినాలకు అన్ని పుస్తకాలు అమ్ముడు పోయాయి. కానీ కథల పుస్తకం ఒక్కటే అలాగే ఉండింది. దానిని ఎవరూ కొనకపోయేసరికి షాపువాడు చెత్త కుప్పలో వేశాడు. అటు నుండి బడికి వెళ్తున్న అరుణ దృష్టి కథల పుస్తకంపై పడింది. చెత్తకుండి దగ్గరికి వెళ్లి పుస్తకాన్ని చేతికి తీసుకొని శుభ్రంగా తుడిచింది. పుస్తకాన్ని కళ్ళకు అద్దుకుని తన సంచిలో పెట్టుకుంది. పుస్తకానికి ఎనలేని సంతోషం కలిగింది.

హైమావతి కథల పుస్తకంలోని కథలన్నింటినీ బాగా చదివింది. చదివిన కథలను తరగతి గదిలో చెప్పుండేది. కథల పోటీలో బహుమతులు కూడా గెలుచుకుంది. ఒకరోజు తన పిల్లలు బీరువాలో ఉన్న పుస్తకాన్ని తీశారు. ఆ కథల పుస్తకాన్ని తిరిగేస్తూ "ఈ పుస్తకం ఎందుకు? పేజీలు చినిగిపోతున్నాయి. బయట పడేయొచ్చు కదా" అని తల్లితో అన్నారు. అప్పుడు తల్లి "ఆ పుస్తకమే నన్ను గొప్పగా తీర్చిదిద్దిందని, అందులోని ఒక్కొక్క కథ జీవితంలో ఎంతో ఉపయోగపడిందని" అంది. నన్ను మార్చిన పుస్తకం ఇది. అందుకే ఇంతకాలం భద్రంగా దాచిపెట్టాను. దీనివల్లనే నేను ఇంతగా ఎదిగాను. ఇది నా ప్రియనేస్తం. చదువుకునే రోజులలో పుస్తకాన్ని కొనాలని అనుకున్నా. డబ్బులు లేక కొనలేకపోయాను. ఎవరూ కొనలేదని కొట్టువాడు చెత్త కుండీలో పడేస్తే దాన్ని ఎంతో భద్రంగా దాచాను. నేను చనిపోయే వరకు ఈ కథల పుస్తకాన్ని కాపాడవలసిన బాధ్యత మీదే. ఈ పుస్తకాన్ని మరల అచ్చు వేయించి కొంత మందికి ఉచితంగా అందజేస్తాను. మీరు కూడా పాఠ్యపుస్తకాలే కాకుండా ఇటువంటి కథల పుస్తకాలను చదివే అలవాటు చేసుకోండి" అంటూ ఆ కథల పుస్తకాన్ని తన యెదకు హత్తుకుంది. ఇంతగా ప్రేమిస్తున్నందుకు ఆ కథల పుస్తకానికి ఎక్కడ లేని ఆనందం కలిగింది.

– కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి



వార్త ఆదివారం

## బాలగేయం

### పరీక్షలు

ఏటా ఏటా జరిగే
సంతోష తిరునాళ్ళు.
విజయాల ముంగిళ్లు
ఆనందాల మధురిమలు.
సమాధానాల లోగిళ్ళు
సవాళ్ళ సరిగమలు
ఆనందపు అంచులు
అనురాగాల లోతులు.
జీవితాన్ని పరిచయం చేసే
చలువ పందిళ్ళు
జీవిత గమనంలో
దారి చూపు దీపాలు.
నిశోదయానికి ఉషోదయాలు
శిశిరానికి చైత్రాలు
గ్రీష్మ తాపానికి.
తొలకరి చిరుజల్లు
వనం వద్దకొచ్చు వసంతాలు.

– రాళ్లబండి
సంగం నాయుడు



**చిన్నారుల ప్రశ్నలకు**
**వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్**
**గిరీష్ అంకుల్ సమాధానాలు**

ఎస్.పుష్ప, కావలి

ప్రశ్న: ఏదైనా ఒక పక్షి ఒకే రుతువులో ఒకే సమయానికి ఒకే ప్రాంతానికి చేరుతుందని ఎలా గుర్తిస్తారు?

**జవాబు:** ఈ అంశాలను తెలుసుకునేందుకు శాస్త్రవేత్తలు మూడు పద్ధతులను అనుసరిస్తున్నారు. 1) పక్షుల కాళ్లకు సన్నటి రబ్బరు రింగులను కట్టడం. 2) రెక్కలకు రేడియో ట్రాన్స్ మీటర్‌లను అమర్చడం. 3) రాడార్‌లను ఉపయోగించడం.

మన దేశంలో పక్షుల కాళ్లకు రింగ్‌లు కట్టే పద్ధతి 1926లో ధార్ మహారాజా(మధ్యప్రదేశ్) ఆధ్వర్యంలో తొలిసారిగా ప్రారంభమైంది. 1960 నుంచి బొంబాయి నేషనల్ హిస్టరీ సొసైటీ ఈ ప్రయోగాలను కొనసాగిస్తోంది. ఏయే తరహాల పక్షులు ఎక్కడెక్కడికి వలస వస్తున్నాయి? ఎక్కడి నుంచి వలస వస్తున్నాయనే విషయం తెలుసుకోవడానికి ఈ సొసైటీ చేసిన ప్రయోగాలు మంచి ఫలితాలను అందించాయి.

కె.అన్విత, కాకినాడ

ప్రశ్న: మెదడుకు నిద్ర అవసరమేంటి?

**జవాబు:** దైనందిన జీవితంలో కొత్త కొత్త నైపుణ్యాలు, నిర్వహణా సామర్థ్యాలను పెంచుకోవడానికి మెదడు పనితీరులో నిద్ర దోహదపడుతుంది. మన వృత్తి, ప్రవృత్తులలో ప్రావీణ్యాన్ని సాధించేందుకు నిద్ర ఒక అనూహ్యమైన విధానంలో మెదడుకు సహకరిస్తుంది. సృజనాత్మకత పెంపొందడంలో కూడా నిద్ర పాత్ర చాలా కీలకమైనది.

మెలకువతో ఉన్నప్పుడు సమకూర్చుకున్న సమాచారాన్నంతటినీ సమీక్షించుకుని, ధృవపరచుకోవడానికి మెదడుకు నిద్ర తోడ్పడుతుంది. ఆలోచనలకు కావలసిన శక్తిని తిరిగి నింపుకోవడానికి, అనవసరమైన, అప్రయోజకరమైన అంశాలను, ఆయా వివరాలను మెదడులో నుంచి మినహాయించడానికి నిద్ర ఉపయోగపడుతుంది.





# వృద్ధుల అనుభవం అమూల్యం

**జీవితమనే ప్రయాణంలో వయసు పెరుగుతుంటే మనిషి చుట్టూ ప్రపంచం మారిపోతుంది. శరీర శక్తి తగ్గుతుంది కానీ అనుభవం పెరుగుతుంది. ఆ అనుభవమే వృద్ధుడి ధనం. వృద్ధుల అనుభవం ఒక పుస్తకం లాంటిది, కానీ ఆ పుస్తకాన్ని చదివేందుకు సహనం, గౌరవం, ప్రేమ కావాలి. వృద్ధుల మాటలు కొన్నిసార్లు నెమ్మదిగా అనిపించవచ్చు, కానీ వాటి లోతు సముద్రం లాంటిది.**

ఇప్పటి వేగవంతమైన కాలంలో యువత మనసు త్వరగా ముందుకు దూకుతుంది, కాని వృద్ధుల అనుభవం ఆ దూకుడుకి దిశ చూపుతుంది. ప్రతి తరం ముందుకు సాగేది పాత తరాల పునాదుల మీదనే. నేడు మనం నడుస్తున్న దారులను మొదట తవ్వింది వృద్ధుల జ్ఞానం. వాళ్ల అనుభవం ఒక స్తంభం లాంటిది. మన సమాజం ఆ స్తంభంపై నిలుస్తుంది.



వృద్ధుల అనుభవం విలువ ఎప్పుడూ కొలవలేం. వారు చూసిన కాలాలు, ఎదుర్కొన్న కష్టాలు, సాధించిన విజయాలు అన్నీ జీవితానికి బోధనలు. ఒక వృద్ధుడు చెప్పిన చిన్న మాట కూడా ఒక జీవిత పాఠమవుతుంది. "కాలం మెల్లగా నేర్పుతుంది" అనేది వారి జీవనసారం. వారు చెప్పే ప్రతి మాటలో ఒక యుగం మోగుతుంది.

వృద్ధుల ఆలోచనలు మనకు నేటి సాంకేతిక యుగంలో సాదాసీదా అనిపించవచ్చు, కానీ వాటిలో మనుష్యత్వం ఉంటుంది. వారు సమాజాన్ని బంధాలుగా చూసారు, మనం సంబంధాల్ని సౌకర్యాలుగా చూస్తున్నాం. కానీ వృద్ధుల చూపులో ప్రతి బంధం ఒక గుణపాఠం. మనం ఆ చూపును అర్థం చేసుకోగలిగితే జీవితమే మనకు గురువవుతుంది.

మన ఇళ్ళలో వృద్ధులు ఉన్నారంటే అది అదృష్టం. వాళ్ల మన కుటుంబానికి విజయవంతమైన చరిత్రను అందించివాళ్లు. వాళ్ల ఉనికి మన మూలాలకు గుర్తు. వృద్ధుల అనుభవం మన పిల్లలకి బుద్ధి, మన మనసులకు స్థిరత్వం ఇస్తుంది. నేటి తరాలు వేగం నేర్చుకున్నాయి, కానీ ఆ వేగానికి అర్థం చెప్పేది వృద్ధులే. వారు మెల్లగా మాట్లాడతారు కానీ ఆ మాటల్లో చరిత్ర ఉంటుంది.

ఒక తాతయ్య కుర్చీలో కూర్చుని పిల్లవాడితో మాట్లాడే క్షణం ప్రపంచంలోని అత్యంత విలువైన పాఠశాల. ఆ మాటల్లో ప్రేమ ఉంటుంది, కరుణ ఉంటుంది, ఆత్మగౌరవం ఉంటుంది. వారు చెప్పే కథలు మనసుని సానుకూలత వైపు మలుస్తాయి. వృద్ధుల పక్కన కూర్చొని వింటే మనసు మెత్తబడుతుంది. మనం ఎంత చదివినా, అనుభవం మాత్రం వాళ్ల దగ్గర నేర్చుకోవాల్సిందే.

వృద్ధుల జీవితం తాత్వికంగా మారుతుంది. వారు చాలా చూసారు, అందుకే చాలా అర్థం చేసుకున్నారు. వారు పాఠాలు చెప్పకపోయినా, వారి నడవడికే పాఠం. ఆ నడవడికలో మనం భవిష్యత్తు చూసుకోవచ్చు. వృద్ధుల అనుభవం అంటే కేవలం జ్ఞానం కాదు, అది ఒక జీవన దీపం. వృద్ధులు ఉన్న ఇల్లు ఎప్పుడూ వెలుగుతుంటుంది, వాళ్ల లేని ఇల్లు వెలుగు కోల్పోతుంది.

ఒక సమాజం వృద్ధులను గౌరవిస్తే అది సంస్కారవంతమైన సమాజం అవుతుంది. వృద్ధులను నిర్లక్ష్యం చేసే సమాజం కాలక్రమంలో విలువలను కోల్పోతుంది.

మనం ఎన్ని కొత్త సాంకేతికతలు నేర్చుకున్నా, జీవిత పాఠం మాత్రం వృద్ధుల నుండి నేర్చుకోవాలి. వారి మాటల్లో దార్శనికత ఉంది, వారి చూపులో అనుభవపు నీడ ఉంది.

మన తల్లిదండ్రులు, తాతలు, అమ్మమ్మలు.. వీరందరూ నడిచిన జీవితం మనకు ఒక దిశ. వాళ్లను వినడం అంటే కాలం మాట్లాడినట్లే. వాళ్లు పంచే కథలు, సూచనలు మనకు కేవలం ఆనందం కాదు, ఒక బుద్ధిని కూడా ఇస్తాయి. "ఏం జరుగుతుందో చూడాలి..!" అని మనం అనుకున్నప్పుడు వారు "ఇది ఇలాగే జరుగుతుంది" అని చెప్పగలరు, ఎందుకంటే వారు చూశారు. వృద్ధుల అనుభవం అంటే కాలం గుండె చప్పుడు. ఆ చప్పుళ్ల మనకు రేపటి నిర్ణయాలకు మార్గం చూపుతాయి. వృద్ధుల మాటలు వినడం అంటే మన జీవితాన్ని లోతుగా అర్థం చేసుకోవడం. వాళ్ల నోట నుండి వచ్చే మాటలు మన హృదయంలో అద్దంలా నిలుస్తాయి.

వృద్ధులు మనం మరిచిపోతున్న విలువలను గుర్తుచేస్తారు. సహనం, కృతజ్ఞత, త్యాగం..

ఇవన్నీ వారి జీవితానికి మూలాలు. వారు కాలం పొడవునా నిలిచిన వృక్షాల్లా ఉంటారు. ఆ వృక్షాల నీడలో మనం కాసేపైనా కూర్చుంటే మనసు ప్రశాంతమవుతుంది. ఈ ప్రశాంతతే మనిషి పెద్ద సంపద.



ప్రపంచం ఎంత మారినా వృద్ధుల జ్ఞానం ఎప్పుడూ కొత్తగానే ఉంటుంది. వారు చెప్పే మాటలు నేటికీ ప్రాసంగికం. మనకు అనిపించే చిన్న విషయాలు వారి జీవితంలో పెద్ద పాఠాలు. మనం అడుగడుగునా నేర్చుకోవాల్సింది వారి ఆత్మస్థైర్యం, నమ్మకం. వారు ఎదుర్కొన్న కష్టాలు మనకు స్ఫూర్తి కావాలి.

వృద్ధుల మనసు పగిలినా, ప్రేమ పగలదు. వారు కష్టాలను క్షమగా భరిస్తారు, ఎందుకంటే వారు జీవితాన్ని విభిన్న రంగుల్లో చూశారు. మనం ఆ సహనాన్ని నేర్చుకుంటే జీవితంలోని తుపాన్లను ఎదుర్కోవడం సులభమవుతుంది. వృద్ధులు మనలో జీవిస్తున్న గురువులు, కేవలం వినగలిగే మనసే కావాలి. ప్రతి కుటుంబంలో వృద్ధుల ఉనికి ఒక ఆశీర్వాదం. వారు మాట్లాడకపోయినా మనం సురక్షితంగా ఉన్నామనే భావన కలుగుతుంది. వారి చూపే మనకు భరోసా. ఆ చూపులో ప్రేమ ఉంది, బాధ ఉంది, అనుభవం ఉంది. మనం వాళ్లను గౌరవించడమే కాదు, వాళ్ల అనుభవాన్ని మన జీవితంలో భాగం చేసుకోవాలి.

మన సమాజం భవిష్యత్తు వృద్ధుల అనుభవం మీదే ఆధారపడి ఉంటుంది. వారు చెప్పిన మాటలు, వారు చూపిన మార్గాలు మనకు దిశనిచ్చే దీపాల్లాంటివి. ఆ దీపం వెలుగుతూనే ఉంటే మన సంస్కృతి నిలుస్తుంది. మనం నడిచే ప్రతి దారిలో వారి నీడ ఉండాలి. ఆ నీడలోనే మన భవిష్యత్తు భద్రంగా ఉంటుంది. జీవితం వృద్ధుల అనుభవంతో పరిపూర్ణమవుతుంది. వారు చెప్పిన ఒక్క మాటతో ఎన్నో తప్పులు తప్పించుకోవచ్చు.

వృద్ధులు చూపించిన మార్గం మన జీవితాన్ని సమతుల్యంగా ఉంచుతుంది. మనం వృద్ధుల విలువ అర్థం చేసుకున్న రోజు మనలోని అహంకారం కరుగుతుంది. ఎందుకంటే వృద్ధుల అనుభవం అంటే జీవితం కరిగించి పొందిన బుద్ధి అని చెప్పవచ్చు.

**ప్రపంచం ఎంత మారినా వృద్ధుల జ్ఞానం ఎప్పుడూ కొత్తగానే ఉంటుంది. వారు చెప్పే మాటలు నేటికీ ప్రాసంగికం. మనకు అనిపించే చిన్న విషయాలు వారి జీవితంలో పెద్ద పాఠాలు.**

వృద్ధుల మనసు సముద్రం లాంటిది, మనం దానిలోని ఒక్క బిందువైనా తెలుసుకుంటే జీవితం వెలుగుతుంది. వారు మన జీవితానికి మూలస్తంభాలు. వాళ్లు ఇచ్చే సలహా మన భవిష్యత్తు మార్గం. అందుకే వృద్ధుల అనుభవం విలువ అనేది ఎప్పటికీ తగ్గని నిధి.

మనిషి పుట్టుకతో జ్ఞానం రాదు, కాలం నేర్పుతుంది. ఆ కాలాన్ని గడిపినవారే వృద్ధులు. వారు సమాజానికి నడిచే పుస్తకాలు. వాళ్లను వినడం అంటే కాలాన్ని వినడం, వాళ్లను గౌరవించడం అంటే జీవన విలువలను గౌరవించడం. వృద్ధుల అనుభవం అంటే మన భవిష్యత్తుకి పునాది. ఆ పునాది బలంగా ఉన్నంతకాలం మన సమాజం నిలుస్తుంది. వృద్ధులను గౌరవించండి వారు మన గతం కాదు, మన భవిష్యత్తుకి అద్దం.

వృద్ధులు కాలం సాక్షులు. వారు చూసిన కాలం మనం ఊహించలేని విశాలమైన గమనం. ప్రతి మడతలో ఒక కథ ఉంది, ప్రతి నిశ్శబ్దంలో ఒక అనుభవం దాగుంది. ఆ అనుభవం కేవలం మాటలలో కాక, వారి చూపులో కనిపిస్తుంది. వృద్ధుల కళ్ళలోకి చూసినప్పుడు మనకు కాలం మాట్లాడుతున్నట్లు ఉంటుంది. ఆ చూపు మన జీవితాన్ని సరిదిద్దే అద్దం. మనలో చాలామంది వృద్ధుల మాటలను పట్టించుకోకపోవచ్చు, కానీ ఆ మాటలు మన జీవితంలో తరువాత ఎంత అవసరమో కాలమే నిరూపిస్తుంది. వృద్ధులు చెప్పే సూచనలు కఠినంగా అనిపించినా, వాటి విలువ అమూల్యం.

– డా. చిటికెన కిరణ్‌కుమార్


## సరదా రచనలకు ఆహ్వానం

**జోక్స్, ప్యారడీ పాటలు, సరదా అనుభవాలు, పంచ్ డైలాగులు.. వగైరాలు పంపితే పరిశీలించి, బాగుంటే ప్రచురిస్తాం. దయచేసి కాపీ రచనలు పంపకండి. మీ రచనలు పంపించవలసిన చిరునామా: నవ్వుల్‌.. రువ్వుల్, ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్‌బండ్, హైదరాబాద్-500 080**

**sunmagvaartha@gmail.com**

కథ

# నాస్తికుడు

ఓట్ర ప్రకాష్ రావు

మాధవరావు పదవీ విరమణ పొందిన తరువాత నాలాగే ఈ గ్రామంలో స్థిరపడ్డాడు.

నేను, మాధవరావుతో కలసి సాయంత్రం వేళ పంట పొలాలవైపు వెళ్తున్నప్పుడు "మన ఊరిలో వున్న రాములవారి భజన మందిరంలో రాముల వారి ఫొటోలు పెట్టి అప్పుడప్పుడు భజన చేస్తున్నారు. ఆ భజన గుడిలో రాముల వారి శిలావిగ్రహాలను ప్రతిష్ఠించి గుడిగా కట్టాలనుకొంటున్నాను" అన్నాడు.

"మంచి ఆలోచన. కానీ ఇది చాలా పెద్ద పని" అన్నాను.

ఉదయమే హైదరాబాద్‌లో ఉంటున్న మా రాంమూర్తి అన్నయ్యకు ఫోను చేసి అడిగాను.

ఆయన 'శుభమస్తు' అంటూ కొన్ని సూచనలు ఇచ్చారు" అన్నాడు మాధవరావు.

"డబ్బులు ఎక్కువగా కావలసి వస్తుంది" అన్నాను మళ్ళీ.

"మన ఊరి వారు చాలామంది హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, ముంబై లాంటి పెద్ద పెద్ద పట్టణాలలో మంచి పొజిషన్‌లో వున్నారు. వారినడిగితే తప్పకుండా పెద్ద మొత్తం వస్తుందనుకొంటున్నాను".


"మంచి ఆలోచనే, ప్రతి పైసా లెక్కలలో ఉండాలి. నీలాగే డబ్బుపై ఆశ లేకుండా నీకు సహకరించే వారిని కమిటీలో ఎన్నుకో" అన్నాను.

"మా రాంమూర్తన్న కూడా అదే మాట చెప్పారు. కుమారవేలు, దివాకర్, మహేష్, గుర్నాథంలను నాకు తోడుగా తీసుకొని పని ప్రారంబించాలనుకొన్నాను" అన్నాడు.

మరో మూడు రోజుల తరువాత నా దగ్గరకు వచ్చి "గుడి కట్టడానికి ఇంతటి ఆదరణ లభిస్తుందని ఎదురు చూడలేదు. రామచంద్ర గారితో నేను వెళ్ళి అడగగానే ఐదు లక్షలు ఇస్తానని చెప్పడం నాకు చెప్పలేనంత ఆశ్చర్యం కలిగింది. ఈ ఆలయం నేననుకొన్న విధంగా డబ్బుకు వెనకాడకుండా పెద్ద గుడిగా కట్టగలనన్న నమ్మకం కలిగింది" అన్నాడు.

"నీ మాటలు వింటుంటే నేనే నమ్మలేకపోతున్నాను. మాన ఊరి మీద అభిమానం, ప్రేమ ఉండటంతో ఎనభై సంవత్సరాల వయసులో వున్న రామచంద్రం గారు ఆయన అంత డబ్బు ఇవ్వడానికి ముందుకు వచ్చారంటే నిజంగా ఆయన గొప్ప మనిషే" అన్నాను.

రాముల వారి భజన మందిరం



రాముల వారి గుడిగా మారుతోంది. పనులు ఎక్కడా ఆగకుండా వేగంగా జరగడం చూసి మాఊరి వారందరూ ఆశ్చర్యంతో గొప్పగా చెప్పుకోసాగారు. డబ్బులకోసం వారు నెలలో ఒకసారి ప్రముఖ పట్టణాలలో నున్న మా ఊరి వారిని కలసి చందాలు వసూలు చేయసాగారు. అనుకున్న దానికంటే ఎక్కువ మొత్తం వసూలయిందన్న తృప్తి కలిగిందని వారు చెప్పడం విన్నాను. ఆ రోజు విజయవాడలో నా కథకు బహుమతి వచ్చిందంటే ఆ సన్మాన సభకు వెళ్ళాను.

బహుమతి తీసుకున్నాక పెద్ద రచయితలతో పరిచయం చాలా ఆనందంగా వుంది. ఒక రచయిత నా దగ్గరకు వచ్చి తనను తాను పరిచయం చేసుకొంటూ "మీ కథలు చదువుతుంటాను. బాగుంటున్నాయి. మీరీవేళ మా ఇంటిలో వుండండి" అంటూ ఆహ్వానిస్తుంటే నా కళ్ళముందు ఐదు లక్షల రూపాయలు గుడికోసం ఇచ్చిన రామచంద్రం మెదిలారు. ఇంతవరకు పరిచయం లేకున్నా ఇంటికి ఆహ్వానించడం నేను నమ్మలేకపోతున్నాను.

"సార్, మా ఊరి వారు ఒక పనిమీద విజయవాడకు వచ్చారు. వారికి తెలిసిన బంధువులింట్లో మాకందరికీ ఏర్పాటు చేశారు. వారందరూ ఈ కార్యక్రమమునకు వద్దామనుకొన్నారు. కానీ ఆలస్యం అయినందువలన రాలేకపోతున్నామని ఇంతకుముందు ఫోన్ చేశారు.

“నేను అప్పుడే చెప్పాను, మీరు నాస్తికులని” అన్నాడు మహేష్.

“నేను దేవుడున్నాడని మీతో వాదించడానికి రాలేదు” వెంకటరమణ వైపు చూస్తూ అన్నాడు మాధవరావు.

ఈ కార్యక్రమం పూర్తి కాగానే అక్కడకు వెళ్తాను. మీ ఆహ్వానానికి ధన్యవాదములు సార్” అన్నాను.

“మీరు ఎక్కడకు వెళ్లాలో చెప్పండి, నా స్కూటరులో డ్రాప్ చేస్తాను”

ఇలాంటి మంచివారున్నారా? అనుకొంటూ “ఇక్కడకు దగ్గరలోనే వారిల్లు వుంది. ఆ ఇంటి నుండి నేను ఇక్కడకు వచ్చాను. మీ అభిమాననానికి ధన్యవాదములండీ” అన్నాను.

అప్పుడే ఫోను రావడంతో చూసాను. రామచంద్రయ్య పేరు చూసి “హలో నమస్కారం చెప్పండి” అన్నాను.

“చందాల కోసం తిరగడం పూర్తయ్యాక ఇప్పుడే మా జయకుమార్ ఇంటికి వచ్చాము. నీవు వచ్చాకనే అందరం కలసి భోజనం చేద్దాం” అన్నారు.

“ఇంకొక అర్ధగంటలో అక్కడుంటాను అనుకొంటున్నాను” అని చెప్పాను.

అర్ధగంట తరువాత వెళ్ళేటప్పటికి మాధవరావు వారి గుడి కమిటీతో తీవ్రంగా చర్చించుకొంటున్నారు.

నన్ను చూడగానే వారి చర్చకు విరామం ఇచ్చారు. నాకిచ్చిన మెమొంటోను చూసి శుభాకాంక్షలు చెప్పారు. కొంతసేపు నాకు జరిగిన సన్మానం గురించి మాట్లాడారు.

మరలా గుడి చందాల గురించి మాట్లాడటం ప్రారంభించారు. కుమరవేలు ఫోనులో మాట్లాడి వచ్చి “విజయవాడలో మన ఊరి అతను వెంకటరమణ ఉన్నారట. అతను వ్యాపారవేత్త. అతను అనుకొంటే పెద్ద మొత్తం ఇవ్వవచ్చు. అతని నంబరు ఇప్పుడే పంపారు” అన్నాడు.

“అతని దగ్గర ఒక్క పైసా రాదు. వెళ్లి ప్రయోజనం లేదు” అన్నాడు మహేష్.

“ఎందుకు?” అడిగాడు దివాకర్.

“అతను నాస్తికుడు. లేని దేవుడు కోసం ఎందుకింత ఖర్చుపెడతారు అంటూ మనకే పాఠం చెప్పినా చెప్పవచ్చు” అన్నాడు మహేష్.

“అతని భార్యను అడుగుదాం” అన్నాడు కుమరవేలు.

“ఆమెకు దేవుడిమీద నమ్మకం లేదని చెప్పారు”

“ఆస్తికులే మనకు గుడి కట్టడానికి ఇంత ఖర్చు చెయ్యాలా? అని చెబుతున్నప్పుడు నాస్తికుడు చెప్పడంలో తప్పులేదు. ఎలాగూ విజయవాడ వచ్చాము. మనం రేపు ఉదయం వారింటికి వెళ్లి అక్కడ నుండి నెల్లూరుకు వెళ్దాము. నేనిప్పుడే వెంకట రమణ గారికి ఫోన్ చేసి అడుగుతాను” అన్నాడు మాధవరావు.

కుమారవేలు దగ్గర ఫోను నంబర్ తీసుకొని ఫోన్ చేసాడు.

మాధవరావు మా ముందే ఫోన్ చేసి మాట్లాడటం పూర్తయ్యాక మా వైపు చూస్తూ “రేపు ఉదయం మీ అందరికీ మా ఇంటిలోనే టిఫన్ ఏర్పాటు చేస్తాను. మీ కోసం ఎదురు చూస్తుంటాను అన్నారు” అన్నాడు మాధవరావు.

“గుడి చందా కోసం అని చెప్పివుంటే బాగుండేది. ఫోనులోనే ఇవ్వనని చెప్పి ఉండేవాడు” అన్నాడు మహేష్.

మరుసటి రోజు ఉదయం వెంకటరమణ ఇంటికి వెళ్ళాము. ఆ దంపతులు ఇద్దరూ మమ్మల్ని సాదరంగా ఆహ్వానించారు.

“మేము మీ దగ్గరకు ఎందుకు రాదలచుకొన్నామన్న సంగతి నేను ఫోనులో చెప్పలేదు” అన్నాడు మాధవరావు.

“మీరు ఏదైనా చెప్పాలనుకొంటే ముందు టిఫన్ తిన్న తరువాత మాట్లాడుకొందాము. ఇప్పటికే ఆలస్యం అయింది” అన్నాడు వెంకటరమణ.

టిఫన్ పూర్తయ్యాక అందరూ కూర్చొన్నాము.

“ఇప్పుడు అసలు సంగతికి వస్తున్నాము” అంటూ గుడి చందా కోసం వచ్చిన సంగతి, పెద్ద మొత్తాలు ఇచ్చిన వారి గురించి చెప్పిన తరువాత “గుడికి మీ వంతుగా ఏదైనా చందా ఇస్తే బాగుంటుంది” అన్నాడు మాధవరావు.

అతను మా వైపు చూస్తూ చిన్నగా నవ్వుతూ “మీకు నా గురించి తెలీదనుకొంటాను”.

“నేను అప్పుడే చెప్పాను, మీరు నాస్తికులని” అన్నాడు మహేష్.

“నేను దేవుడున్నాడని మీతో వాదించడానికి రాలేదు” వెంకటరమణ వైపు చూస్తూ అన్నాడు మాధవరావు.

“మన ఊరివారైనా మీరు మా యింటికి అతిథులుగా వచ్చిన మీతో నాస్తికత్వంపైనా చర్చించడానికి నేనూ సిద్ధంగా లేను” అన్నాడు వెంకటరమణ.

“ఊరివారందరూ కలసి పెద్దగా గుడి కట్టించాలనుకొన్నాము. మీకు నమ్మకం ఉందా లేదా అని అడగడానికి రాలేదు. మన ఊరి మనిషిగా మేము తలపెట్టిన ఈ సంకల్పానికి మీరు ఏదైనా సాయం చేయమని అడగడానికి వచ్చాను” అన్నాడు మాధవరావు.

“దేవుడి గుడికి అంటూ అడిగితే ఒక్క పైసా ఇవ్వడానికి నా మనసు అంగీకరించదు. కానీ మన ఊరి మనుషులైన మా ఇంటికి వస్తే...!” అంటూ ఆలోచించసాగాడు.

ప్రమోద్ లేచి నిలబడి “నాన్నా, ఒక్క నిమిషం నాతో రండి” అంటూ వెళ్తుంటే వెనుకనే వెంకటరమణ వెళ్ళాడు.

వెళ్ళాడు.

"నేనప్పుడే చెప్పానుగా ఈయన దగ్గర పైసా రాదనీ" అన్నాడు మహేష్.

"ఆగు మహేష్.. తొందర పడవద్దు" అన్నాడు మాధవరావు.

కొన్ని నిమిషాలు గడిచాయి. వెంకట రమణ, ప్రమోద్ కలసి వచ్చారు .

"అంత దూరం నుంచి విజయవాడకు వచ్చిన మన ఊరి వారిని నిరుత్సాహపరచడం నాకు ఇబ్బంది కలిగించినట్లవుతుంది.. అని ఆలోచిస్తుంటే మా అబ్బాయి ప్రమోద్ మంచి ఆలోచన చెప్పాడు"

"ఏమిటాలోచన?" అడిగాడు.

"మీరు నా నుంచి ఎంత ఆశిస్తున్నారు?"

"కనీసం యాభై వేల రూపాయలు తక్కువ కాకుండా" అన్నాడు మాధవరావు.

వెంకటరమణ మా అందరి వైపు చూస్తూ "మీరనుకున్న దానికన్నా అంటే యాభై వేల రూపాయల కన్నా ఎక్కువగా ఇవ్వదలచుకొన్నాను కానీ మీకు చందాగా ఇవ్వను" అన్నాడు

"చందాగా ఇవ్వను అంటే..?"

"ఎలాగా? అన్నది ఇప్పుడు అడగకండి. అప్పుడు మీరే తెలుసుకొంటారు. ఇక మన ఊరి గురించి మాట్లాడుకొందాం" అన్నాడు.

.................



అందమైన రాముల వారి గుడి నిర్మాణం నిర్విఘ్నంగా పూర్తయింది. కుంభాభిషేకానికి ముహూర్తం నిర్ణయించారు. మా ఊరి వారంతా కలసి గుడి కుంభాభిషేకం వేడుకలో పాల్గొన్నారు. ఆ రోజు ఒక్క ఇంటిలోనూ పొయ్యి వెలగలేదు. వంట వాళ్ళను పిలిపించి ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనము ఏర్పాటు చేశారు.

భోజనం అయ్యాక గుడిముందున్న షామియానా కింద మైక్ ముందు నిలబడి మాధవరావు ఎక్కువ సమయం మాట్లాడాడు. చివరగా "ఈ గుడి కట్టడానికి ఎంతోమంది పెద్దలు ఎన్నో విధాల సహకరించిన ఫలితమే ఈ రోజు గొప్పగా రాముల వారి గుడి కట్టగలిగాం. మంచి మనసుతో పెద్ద మొత్తాలు, చిన్న మొత్తాలు చందాలుగా ఇచ్చిన వారందరికీ శిరస్సు వంచి నమస్కరించుచున్నాను.

నా ప్రసంగం ముగించడానికి ముందు ఒక ప్రత్యేకమైన మనిషి గురించి మీకు చెప్పాలనుకున్నాను.. ఆయన పేరు వెంకటరమణ. మీ కందరికీ వెంకటరమణ గురించి బాగా తెలుసు" అంటూ తన కొన్ని క్షణాలు ప్రసంగం ఆపి అందరి వైపు చూశాడు. "వెంకటరమణ, గొప్ప నాస్తికుడని మా ఊరి వారందరికీ తెలుసు" ఆ మాట ప్రసంగంలో చెప్పకూడదనుకొని అలా చెప్పాడని ఊహించాను. మరలా మాట్లాడుతూ "వెంకట రమణ గురించి నేను చెప్పడం కన్నా పెద్దలు శ్రీరామచంద్రయ్య మాట్లాడటానికి సిద్ధంగా వున్నారు. రామచంద్రం గారిని మాట్లాడమని ఆహ్వానిస్తున్నాను" అంటూ కుర్చీలో కూర్చొన్నాడు.

రామచంద్రయ్య మైక్ ముందు నిలబడి ప్రసంగించసాగారు.. కొంత సమయం గుడి కట్టడంలో ముఖ్యపాత్ర వహించిన వారి గురించి మాట్లాడిన తరువాత తన ప్రసంగములో "మా బాల్యం అంటే అంతులేని ఆనందం. ఆనందం తప్పితే ఏమీ తెలియని రోజులు. చిన్నప్పుడు మేము ఆడిన ఆటలు తీయటి మధురస్మృతులు. కానీ నేటి బాలలు డిజిటల్ ప్రపంచంలో జీవిస్తున్నారు. వారికి ఈ ఆనందం తెలీదు. మేము బాల్యంలో ఆడిన అనేక ఆటలు కనుమరుగయిపోయింది. ఇక ఈ కాలం పిల్లలకు ఆ ఆటలకు ఎటువంటి సంబంధం ఉండదని బాధపడేవాడిని. మూడు రోజుల క్రితం వెంకటరమణ ఈ ఊరికి వచ్చి తాను చేయదలచుకొన్న పని గురించి చెప్పగానే రాములవారి గుడి గోపురం బంగారుతో నిర్మించినంతగా సంతోషపడ్డాను. మా వయసు కలవారినందరినీ ఒక్కటిగా కూర్చొని మా బాల్యంలో ఈ ఊరిలో ఆడుకున్న ఆటలను గురించి వివరంగా అడిగి రాసుకున్నాడు. ఈ గ్రామం పిల్లలకు ఆ కాలం నాటి ఆటల పోటీలు నిర్వహించబోతున్నట్లు చెప్పారు.

ఆటల పేర్లు, వాటికి ఇవ్వదలచుకొన్న బహుమతులను ఆటల పోటీలు పెట్టడానికి ముందుగానే బడిలో ప్రదర్శించగానే ప్రతిఒక్కరు ఉత్సాహంతో పాల్గొన్నారు. గోనె సంచులు తొడుక్కొని పరుగు పందేలు, నేల బండాట, తొక్కుడుబిళ్ళ, కబడ్డీ బిళ్ళంగోడు/ఛిల్లా కట్టే, గోళీలాట, బొంగరాలతో ఆటలు, నాలుగు స్తంభాలాట, కోతి కొమ్మచ్చి, కుంటి ఆట, సైకిల్ టైర్లతో పందేలు మొదలైనవి నిర్వహించి వాటికి బహుమతులు ఇవ్వదలచుకొన్నట్లు చెప్పారు. ఒకరు వచ్చి  చికు చికు పుల్లాట అంటూ ఎవరో చెబితే వాటిని కూడా తన జాబితాలో చేర్చారు. ఈ వీధిలో తిరుమలయ్య కడుతున్న ఇంటికి ఇసుక తెచ్చి ఉంటే ఆ ఇసుకలో ఆ ఆటలు నిర్వహించి విజేతలను ఎన్నుకొన్నారు. మన గ్రామంలో అబ్బాయి ప్రక్క గ్రామానికి వెళ్లి కర్రసాము నేర్చుకున్నాడని తెలియగానే ఆ అబ్బాయికి  పెద్ద బహుమతి ఇవ్వడానికి నిర్ణయించుకొన్నారు.

విజేతలకు ఇవ్వవలసిన బహుమతులు వెంకటరమణ ఇవ్వాలని మేమంతా గట్టిగా పట్టు పట్టడంతో అంగీకరించారు. ఇప్పుడు ఆయన బహుమతులు ఇవ్వడానికి వస్తున్నారు. ఒక గొప్ప కార్యక్రమం చేపట్టిన వెంకట రమణకు ఎలా కృతజ్ఞతలు చెప్పాలో అర్థం కావడంలేదు" అన్నారు. అప్పుడే రాములవారి గుడిలో గంట వెంకటరమణను ఆశీర్వదిస్తున్నట్లుగా గణ గణమని మోగసాగింది. ■

# ఆ ముసుగు తొలగాలి!

ఒకానొక నగరంలో ఒక శాస్త్రీయ సంగీతం కార్యక్రమం జరుగుతోంది. ఒక వ్యక్తి ఆ కచేరీ చూడాలనుకున్నాడు. కానీ అతని దగ్గర ప్రవేశ టికెట్టు లేదు!

ఒక ప్రముఖ మ్యాగజైన్‌లో చిత్రకారుడిగా పని చేసే స్నేహితుడు అతనికి సహాయం చేయడానికి ముందుకొచ్చాడు.

“మా ఆఫీసులో మూడు పాసులు వచ్చాయి. వాటిలో నీకొకటి ఇస్తాను” అని ఆ స్నేహితుడు చెప్పినప్పుడు ఆ వ్యక్తి మనసు ఉత్సాహంతో ఉప్పొంగింది.

కచేరీ రోజున, అతను తన స్నేహితుడు ఇచ్చిన పాస్ తీసుకొని కచేరీ హాలుకు వెళ్ళాడు.

అక్కడ, ప్రవేశ ద్వారం వద్ద నిల్చున్న ఉన్న వ్యక్తి అతని వైపు అనుమానంగా చూశాడు.

“నువ్వు... ఆ మ్యాగజైన్‌లో పని చేసే ఆర్టిస్టా?” అని అడిగాడు.

“అవును...” అని అతను నెమ్మదైన స్వరంతో అన్నాడు.

అతను వెంటనే, “ఆ మ్యాగజైన్ ఎడిటర్ ఇప్పుడే లోపలికి వెళ్ళాడు. నిన్ను ఆయన దగ్గరకు తీసుకుపోతాను, పద” అన్నాడు. ఆ మాటతో సంగీతం కార్యక్రమాన్ని తిలకించాలనుకున్న వ్యక్తి ఖంగుతిన్నాడు.

“నేను ఇప్పుడు వెనక్కి తగ్గలేను... ఏం జరగబోతోందో? నేను చిత్రకారుడిని కాదనే నిజం బయటపడిపోతే నా పరిస్థితి ఏమిటి? వారు నన్ను అమాంతం బయటకు నెట్టేస్తారు...అది అవమానకరం కదా? నేను కచేరీ చూడలేను” అని ఆలోచించాడు. అతను ఒకింత అయోమయంగానే అతనిని అనుసరించాడు.

ఆ పత్రిక ఎడిటర్ ముందు వరుసలో కూర్చున్నారు.

అతన్ని తీసుకెళ్లిన వ్యక్తి ఎంతో వినయాన్ని ప్రదర్శిస్తూ ఆ ఎడిటరుతో “సార్! నాకొక సందేహం... మిమ్మల్ని అడగొచ్చా?” అని అన్నాడు.

ఎడిటర్ “ఏమిటీ?” అన్నట్లుగా అతని వైపు చూశాడు.

“ఈ వ్యక్తి మీకు తెలుసా?”

వెంటనే, ఆ సంపాదకుడు ఆ వ్యక్తిని ఒకసారి పైకి కిందికి చూసి, “ఎందుకలా అడుగుతున్నావు?” అని అడిగారు.

“ఏమీ లేదండీ...... ఇతను మీ పత్రిక ఉద్యోగేనా? అని తెలుసుకోవాలనుకుంటున్నాను సార్?”

“అవును... ఎవరు కాదు?” అని సంపాదకుడు కోపంగా అంటూ అసహనాన్ని ప్రదర్శించారు.

అంతే...! సందేహాన్ని తీర్చుకోవాలనుకున్న వ్యక్తి అతనిని సంపాదకుడి పక్క సీట్లో కూర్చోబెట్టి ఇద్దరికీ క్షమాపణలు చెప్పి, అక్కడి నుంచి ఇవతలకు వచ్చేశాడు.

సంగీతం కార్యక్రమాన్ని చూసి తరించాలనుకున్న వ్యక్తి ముఖం కళకళలాడింది. అమ్మయ్య అని



అనుకున్నాడు.

అతను నెమ్మదిగా ఎడిటర్ వంక చూసి, “సార్... నా గౌరవాన్ని కాపాడినందుకు మీకు ధన్యవాదాలు!” అన్నాడు భావోద్వేగంతో.

సంపాదకుడు “ఈ మాత్రం దానికి ధన్యవాదాలు ఎందుకు సోదరా? ఇది కేవలం ఒక స్నేహితుడి సహాయం. ఒకరికొకరు సహకరించుకోవడం మానవత్వమేగా!” అన్నాడు.

అతనికి ఏమీ అర్థం కాలేదు. అతను మళ్లీ.. “మీకో నిజం చెప్పాలి. నిజానికి నేను సంపాదకుడిని కాదు. నేను మీలాగే ఫ్రీ పాసుతో ఇక్కడికి వచ్చాను!” అని చిరునవ్వు నవ్వాడు..

మిత్రులారా! నేటి ఆధ్యాత్మిక ప్రపంచం ఇలాగే ఉంది. శిష్యులుగా నటించేవారు గురువులుగా నటించే వారి వద్దకు వెళ్లి ఆశీర్వాదం కోరుకుంటారు. ఆ ముసుగు తొలగిపోవాలి. వెలుగు కనిపించాలి. అప్పుడే సత్యాన్ని గుర్తించగలం.

– యామిజాల జగదీశ్

**రచనలకు ఆహ్వానం**

**రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. రచనలతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జత చేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు దయచేసి పంపించకండి. రచనలు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.**

**sunmagvaartha@gmail.com**





# భారతదేశంలో పూల పండుగలు

భిన్నత్వంలో ఏకత్వం కలిగిన మన దేశంలో పూలకు ఎంతో ప్రాధాన్యత ఉంది. పువ్వులు కేవలం అందానికి చిహ్నాలు మాత్రమే కాదు. అవి మన సంస్కృతికి, ఆచారాలకు, పండుగలకు ప్రాణవాయువు వంటివి. మన దేశంలో చాలా మంది మహిళలు శిగలో పూలు పెట్టుకోవడానికి ఇష్టపడతారు. ప్రతి శుభ కార్యంలోనూ పువ్వు మన జీవితంలో భాగస్వామి అవుతుంది. దేవతార్చనకే కాకుండా, పువ్వులనే దైవంగా భావించి పూజించే అరుదైన సంస్కృతి మన భారతీయ పండుగల్లో కనిపిస్తుంది. శుభానికి, అశుభానికి కూడా పూవ్వులు వాడుతుంటారు. ఋతువులు మారినప్పుడల్లా ప్రకృతి తనను తాను కొత్తగా ఆవిష్కరించుకుంటుంది. ముఖ్యంగా వసంత కాలంలో వికసించే పూల సోయగం వర్ణనాతీతం. మనదేశంలో అనేక ప్రాంతాలలో పూల పండుగలు జరుపుతుంటారు. కన్నుల పండుగగా జరిపే ఇటువంటి కార్యక్రమాలను చూడటానికి అందరూ ఆసక్తి చూపుతారు.

## తులిప్ పూల పండుగ

భారతదేశంలోని జమ్మూ కాశ్మీర్‌లో జరిగే తులిప్ పండుగ అద్భుతమైనదిగా చెప్పవచ్చు. మార్చి నుండి ఏప్రిల్ మాసాల్లో శ్రీనగర్‌లో తులిప్ పూలు ఎక్కువగా పూస్తాయి. శ్రీనగర్‌లోని ఇందిరాగాంధీ మెమోరియల్ తులిప్ గార్డెన్‌లో జరిగే తులిప్ పూల పండుగను చూడటానికి దేశ, విదేశాల నుండి పర్యాటకులు వస్తుంటారు. ఇది ఆసియా ఖండంలోనే అతి పెద్ద తులిప్ పూల ఉద్యానవనం. ఇక్కడ 70కి పైగా తులిప్ పూల రకాలను తిలకించవచ్చు. భూతల స్వర్గంగా ప్రశంసలందుకుంటున్న కాశ్మీర్‌లోని శ్రీనగర్‌లో ప్రతి ఏడాది మార్చి నెల చివర నుండి ఏప్రిల్ నెల మధ్య వరకు సుమారు 15 రోజుల పాటు శ్రీనగర్‌లో తులిప్ పూల పండుగ జరుగుతుంది.

## గులాబీ పూల పండుగ

ఈ పండుగ ప్రతి ఏడాది ఫిబ్రవరిలో పంజాబ్, హర్యానా రాష్ట్రాల ఉమ్మడి రాజధాని చండీగఢ్‌లోని జాకీర్ హుస్సేన్ రోజ్ గార్డెన్, లీజర్ వ్యాలీలో మూడు రోజుల పాటు జరుగుతుంది. గ్రాండ్ రోజ్ ఫెస్టివల్ పేరుతో జరిగే ఈ గులాబీల పండుగను తిలకించడానికి సుదూర ప్రాంతాల నుండి పర్యాటకులు వస్తుంటారు. సువాసనలు వెదజల్లే రంగు రంగుల అరుదైన గులాబీలను ఇక్కడ తిలకించిన సందర్శకులు రోజ్ ప్రిన్స్, రోజ్ ప్రిన్సెస్‌ను ఎంపిక చేస్తారు. 1,600 రకాల గులాబీలను ఈ పోటీలలో చూడవచ్చు.

## ఊటీ ఫ్లవర్ షో

తమిళనాడులోని ఊటీలో ప్రభుత్వ బొటానికల్ గార్డెన్‌లో మే నెలలో ఊటీ ఫ్లవర్ షో జరుగుతుంది. ఊటీ పూల ప్రదర్శన మొదట 1895లో నిర్వహించారు. అప్పటి నుండి దీన్ని ప్రతి సంవత్సరం విజయవంతంగా నిర్వహిస్తున్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ పూల పండుగలో పూల ప్రదర్శన, సుగంధ ద్రవ్యాల ప్రదర్శన, గులాబీల ప్రదర్శన, పండ్ల ప్రదర్శన, కూరగాయల ప్రదర్శన ఏర్పాటు చేస్తారు. వేసవి విడిదిగా పేరొందిన ఊటీలో మే నెలలో ఈ పూల పండుగ జరుగుతుంది. అరుదైన జాతులతో సహా 15,000ల కంటే ఎక్కువ పుష్పాలు ఈ ప్రదర్శనలో తిలకించవచ్చు.

## అంతర్జాతీయ పూల ఉత్సవం

సిక్కిం రాజధాని నగరం గ్యాంగ్‌టక్ అంతర్జాతీయ పూల ఉత్సవం జరుగుతుంది. మార్చి,



ఏప్రిల్ నెలలు ఈశాన్య భారతదేశం ముఖ్యంగా సిక్కింలో పుష్పాలు విరగపూసే సమయం. ఈ ఉత్సవంలో 600ల కంటే ఎక్కువ అరుదైన పుష్ప జాతులను తిలకించవచ్చు. అనేక రకాల గులాబీలతో పాటు గ్లాడియోలి, ఫెర్న్ రకాలు, మూలికలు, కాక్టి, లతలు, క్లైంబర్లు, రంగు రంగుల వృక్షజాలాన్ని ఇక్కడ చూడవచ్చు.

## లాల్‌బాగ్ ఫ్లవర్ షో

కర్ణాటక రాష్ట్రం బెంగళూరును ఉద్యానవనాల నగరం అని పిలుస్తారు. ఇక్కడి లాల్‌బాగ్ బొటానికల్ గార్డెన్‌లో సంవత్సరానికి రెండుసార్లు పూల ఉత్సవాలు జరుగుతాయి. ఒకటి జనవరిలో గణతంత్ర దినోత్సవం, మరొకటి ఆగస్టులో స్వాతంత్ర్య దినోత్సవంనాడు జరుగుతాయి. పూలతో అనేక కళాకృతులను చేసి విశేషంగా ఆకట్టుకుంటారు. అద్భుతమైన పూల అలంకరణలు సందర్శకులను ఆశ్చర్యపరుస్తాయి. ఇతర దేశాలకు చెందిన అరుదైన పూలను సైతం ఇక్కడ చూడవచ్చు.

## కాస్ పీఠభూమి పూల ప్రదర్శన

మహారాష్ట్రలో సతారా జిల్లాలో ఉన్న కాస్ పీఠభూమిలో ఈ పూల ప్రదర్శన జరుగుతుంది. దీన్ని మహారాష్ట్ర లోయ, పువ్వుల లోయ అంటారు. భారతదేశంలో అందరినీ మంత్రముగ్ధులను చేసే పుష్ప ప్రదర్శన. ఇది లక్షలాది మంది సందర్శకులను ఆశ్చర్యపరుస్తుంది. ఆగస్టు చివరి నుండి సెప్టెంబర్ ప్రారంభం వరకు మహారాష్ట్రలో జరుగుతుంది. ఇక్కడ కార్వే, స్మితీయ, నీలి పూలను చూడవచ్చు. వర్షాకాలం ముగిసే నాటికీ ఈ పీఠభూమి మొత్తం రంగు రంగుల పూలతో అద్భుతమైన తివాచీ పరచినట్టు ఉంటుంది. మహారాష్ట్రలోని కాస్ పీఠభూమి 860 కంటే ఎక్కువ జాతుల అడవి పువ్వులకు నిలయంగా ఉండటం వల్ల యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశంగా గుర్తింపు పొందింది.

## దసరా ఫ్లవర్ షో

దసరా వేడుకల్లో భాగంగా దసరా ఫ్లవర్ షో అనేది మైసూరులో ప్రతి ఏడాది జరుపుకునే గొప్ప పూల ఉత్సవం. ప్రత్యేకంగా చెప్పాలంటే ఈ భారీ కార్యక్రమం సెప్టెంబర్‌రు–అక్టోబరులో నిషాద్ బాగ్‌లో నిర్వహిస్తారు. ఈ పూల ఉత్సవంలో గులాబీలు, ఆర్కిడ్ పూలు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయి. సంగీత ఫౌంటెన్ ఈ ఉత్సవానికి అదనపు ఆకర్షణ. 12 రోజుల పాటు జరిగే ఈ ఉత్సవంలో ప్రతి కార్యక్రమం మహాద్భుతంగా ఉంటుంది.





## చెర్రీ బ్లోసమ్ ఫెస్టివల్

ఈశాన్య భారతదేశంలోని మేఘాలయలోని షిల్లాంగ్ వసంత కాలంతో పాటు వేసవి కాలంలో పూలతో నిండి ఉంటుంది. ఆ కారణంగా ప్రతిరోజు ఈ ప్రాంతంలో పూల పండుగలా కనిపిస్తుంది. చెర్రీ బ్లోసమ్ ఫెస్టివల్ నవంబర్‌లో మేఘాలయలోని షిల్లాంగ్‌లో నిర్వహిస్తారు. వసంత కాలంలో ఈ ప్రాంతంలో అనేక ప్రదేశాలు చెర్రీ బ్లాసమ్స్ పూలు తివాచి పరచినట్లు నయనానందాన్ని కలిగిస్తాయి.

తెలంగాణ మట్టి వాసనను, ఆడపడుచుల ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పే అపురూపమైన పూల పండుగ 'బతుకమ్మ'. ప్రకృతిని పూజించే ఈ గొప్ప వేడుక, గునుగు, తంగేడు పూలతో భూతల్లికి అర్పించే నీరాజనం. ప్రతి ఏడాది భాద్రపద అమావాస్య మొదలు ఆశ్వయుజ శుక్ల అష్టమి వరకు తొమ్మిది రోజులు బతుకమ్మ పండుగ జరుపుకుంటారు. బతుకమ్మను ప్రధానంగా తంగేడు పూలు, గునుగు, గుమ్మడి, మందార, బంతి, చేమంతి, గోరింట, బీర పువ్వులతో పేరుస్తుంటారు. అలాగే తొమ్మిది రోజుల పాటు సాగే బతుకమ్మ వేడుకల్లో బతకమ్మను రోజుకో పేరుతో పిలుస్తారు.

## మున్నార్ ఫ్లవర్ షో

కేరళలోని మున్నార్ ఫ్లవర్ షోలో ప్రతి 12 సం॥కు ఒకసారి వికసించే అరుదైన నీలకురింజితో సహా అనేక రకాల పుష్పాలు ప్రదర్శిస్తారు. ఈ ప్రదర్శనలో సాంస్కృతిక ప్రదర్శనలు, స్థానిక వృక్షజాలం గురించి విద్యా ప్రదర్శనలు కూడా ఉంటాయి. కేరళలో ఓనం పండుగను పువ్వుల పండుగ అని పిలుస్తారు. ఆ రోజు ఇళ్ల ముందు రంగు రంగుల పూలతో 'పూకళం' వేసి పండుగ జరుపుకుంటారు. ఓనం పండుగ సందర్భంగా, పురాణ రాజు మహాబలి ఇంటికి తిరిగి వచ్చినందుకు ప్రజలు ఇల్లంతా పూలతో అలంకరిస్తారు. ఈ పూల పండుగలన్నీ భారతీయుల జీవన విధానంలో భాగమయ్యాయి.

– షేక్ అబ్దుల్ హకీం జాని

# కోరికలు తీర్చే మారుతి నిలయం

**ప్రకాశం** జిల్లాలో ప్రసిద్ధి చెందిన శ్రీ ఆంజనేయ స్వామి ఆలయాలలో సింగరకొండలో ఉన్న శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం ఒకటి. సుమారు ఆరు వందల సంవత్సరాల చరిత్ర కలిగిన క్షేత్రం సింగరకొండ.

14వ శతాబ్దంలో పక్కనే ఉన్న గ్రామానికి చెందిన సింగన్న అనే స్వామి భక్తుడు తన కుమార్తెతో కలసి ఆవులను మేపడానికి ఈ కొండ వద్దకు వచ్చేవాడు. మందలోని ఒక గోవుపాలు ఇవ్వకపోవడాన్ని గమనించిన సింగన్న దానిని అనుసరించి పోగా ఆ ఆవు కొండ మీద ఒకచోట ఆగగా అక్కడి గుహ నుండి ఒక బాలుడు బయటికి వచ్చి పాలు తాగడం చూశాడు. అది తన ఆరాధ్య దైవమైన శ్రీ నరసింహ స్వామి వారేనని తెలుసుకొన్న సింగన్న అక్కడ శ్రీ స్వామి వారి ఆలయాన్ని గ్రామస్తుల సహకారంతో నిర్మించాడు. తదనంతర కాలంలో దేవరాయలు అనే స్థానిక పాలకుడు పూర్తి స్థాయిలో ఆలయాన్ని నిర్మించారు. కాల గమనంలో భక్తుల సహకారంతో అనేక మార్పులు చోటు చేసుకొని ప్రస్తుత రూపు సంతరించుకొన్నది. ప్రశాంత ప్రకృతికి చిరునామా అయిన చిన్న కొండ మీద ఉన్న ఈ ఆలయం ఉత్తర దిశగా ఉంటుంది. పర్వత పై భాగానికి చేరుకోడానికి సోపాన, రహదారి మార్గాలున్నాయి.



గర్భాలయంలో ప్రతిష్టా మూర్తి అయిన శ్రీ లక్ష్మీ నారసింహ స్వామి తన ఎడమ భాగాన అమ్మవారిని కూర్చోపెట్టుకొని రమణీయ పుష్పాలంకరణతో నేత్ర పర్వంఢి దర్శనమిస్తారు. ముఖ మండపంలో గాయక భక్తులైన పన్నెండు మంది ఆళ్వారుల విగ్రహాలనుంచారు. వైకుంఠ ఏకాదశి, నృసింహ జయంతి, ధనుర్మాస పూజలు, ప్రతి ఏడాది హోలీ పండుగ నాడు పెద్ద ఎత్తున జరిపే తిరునాళ్ళు ఇక్కడి ముఖ్య ఉత్సవాలు.

రెండు శతాబ్దాల క్రితం కొండ మీద ధ్వజస్థంభ ప్రతిష్ట జరుగుతున్న సమయంలో వేలాది భక్తులు చూస్తుండగా కొండ కింద ఒక యోగీశ్వరుడు వచ్చి దక్షిణా ముఖంగా శ్రీ ఆంజనేయ స్వామి విగ్రహాన్ని భవనాశి సరోవర తీరంలో ఉంచి అదృశ్యమయ్యాడట. అలా యోగి స్వామిని ఇక్కడే ఉంచడానికి సంబంధించిన కథ: సీతాన్వేషణకు దక్షిణ దిశగా బయలుదేరిన వానరుల బృందంలో ఆంజనేయుడు ఉన్నాడు. ఈ విధంగా చూస్తే రావణ లంక ఉన్నది ఆ దిశలోనే కదా! ఆయన మాత్రమే శత యోజన సముద్రాన్ని దాటి లంకను చేరుకొన్నది. లంఖిణి ఓడించి లంకా నగరంలో ప్రవేశించారు. అశోక వనంలో ఉన్న జానకీమాతను చూసి ముద్రికను ఇచ్చి ధైర్యం చెప్పారు. రావణ కుమారుని హతమార్చారు. రావణునికి శ్రీరామ సందేశాన్ని తెలిపారు. లంకా పట్టణాన్ని అగ్నికి ఆహుతి చేశారు. దక్షిణ దిశను చూసే హనుమంతుడు మానవ జీవితాలలో జాతక రీత్యా నెలకొనే దుష్ట గ్రహ ప్రభావాన్ని తొలగిస్తారు అంటారు.

శ్రీ మహావిష్ణువు మరో అవతారమైన శ్రీ నృసింహ స్వామి కొలువైన పవిత్ర క్షేత్రంలో స్వామి వారు ఆ విధంగా కొలువు తీరారు. నారసింహుడు భక్తుల సకల కష్టాలను ఎదుర్కొనే మానసిక నిబ్బరాన్ని గెలిచే శక్తిని ప్రసాదిస్తారు అన్నది భక్తుల నమ్మకం ఆయనతో కలిసి దక్షిణా ముఖ హనుమంతుడు అపమృత్యువును నివారిస్తాడని భక్తుల విశ్వాసం. కొండ మీద ఉత్తర దిశగా కొలువైన శ్రీలక్ష్మి నారసింహ స్వామి వారి సేవ నిమిత్తం భృత్యుడు సిద్ధంగా ఉంటూ ఇలా వెలిసారని అంటారు.

ఏది ఏమైనా తొలుత నృసింహ క్షేత్రమైన సింగర కొండ తదనంతర పరిణామాలలో మారుతి నిలయంగా మారింది. అధిక సంఖ్యలో భక్తులు శ్రీ అంజనేయ దర్శనార్థం వస్తారంటే అతిశయోక్తి లేదు. ప్రధాన ఆలయం దక్షిణ దిశలో ఉండగా ప్రాంగణంలో మరో వాయునందనుని సన్నిధి పడమర దిశలో ఉండటం విశేషంగా చెప్పుకోవాలి. భవనాశి సరోవర తీరాన కొలువైన అంజనాసుతునికి ప్రతిరోజూ పర్వదినమే!

ఉదయం ఆరు గంటల నుండి రాత్రి ఏడుగంటల దాకా తెరిచి ఉండే ఆలయంలో అభిషేకం నుండి ప్రదోషకాల పూజ దాకా ఎన్నో సేవలు నిత్యం స్వామి వారికి జరుపుతారు. అన్ని పండుగలు ఘనంగా, సమష్టిగా జరుపుకొంటారు. శ్రీరామ నవమి, హనుమత్ జయంతి, శ్రీ నృసింహ జయంతి, వైకుంఠ ఏకాదశి మొ॥ పర్వదినాలను, స్థానిక పండుగలను వైభవంగా నిర్వహిస్తారు. ప్రతి సంవత్సరం ఫాల్గుణ శుద్ధ పౌర్ణమి నాడు జరిగే తిరునాళ్ళలో రాష్ట్రం నలుమూలల నుండి భక్తులు వచ్చి పాల్గొంటారు.

**ఇలా చేరుకోవచ్చు:** సింగరకొండ గ్రామం ప్రకాశం జిల్లా అద్దంకికి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్నది. ఒంగోలు నుండి సులభంగా చేరుకోవచ్చు. ప్రశాంత ప్రకృతికి, ఆధ్యాత్మిక వాతావరణానికి పెట్టింది పేరైన సింగరకొండ దేవతల నిలయంగా పేర్కొనదగ్గది.

– ఇలపావులూరి వెంకటేశ్వర్లు

వాస్తువార్త
వాస్తు విద్వాన్ సాయిశ్రీ
డా॥ దంతూరి పండరినాథ్
సెల్స్: 9885446501/9885449458

# ఉద్ఘాటిత కవాట వేధ అంటే ఏమిటి?

**ఎ.మహేశ్, గుంటూరు**

**ప్రశ్న: ఉద్ఘాటిత కవాట వేధ గురించి వివరించగలరు.**

**జవాబు:** ద్వార బంధ ప్రతిష్ట, ద్వారాలు బిగించుట సరైన నక్షత్రంలో వుండాలి. ద్వారాలు వేసినప్పటికీ వాటంతటవే తెరుచుకోకూడదు. అలా తెరుచుకోవటం వాస్తు దోషమవుతుంది. 'ఉన్మాద! స్వయముద్ఘాటితే" అనే శాస్త్ర వచనం ఉంది. అంటే ఈ దోషం వున్న గృహం వలన ఆ గృహ యజమానికిగానీ, అందులో నివసించేవారికిగానీ మానసిక రుగ్మతలు కలిగే అవకాశం ఉంది. ఒకవేళ ఎవరికైనా ఉన్మాదం, లేదా మానిసక రుగ్మతలు ఉన్నట్లయితే ఏ మందులకూ తగ్గకపోతే వారి గృహం ద్వారాలు పైన ఉదహరించిన దోషం కలిగి వుందేమోనని ఒకసారి పరిశీలించుకోవటం మంచి.

అలాంటి దోషం ఉన్నట్లయితే వారి సమసనయల కారణం ఈ వాస్తు దోషమేనని నిర్ధారించుకోవచ్చు. మూసిన తలుపులు తామంత తామే తెరవబడక స్థిరంగా వుండేలా సరిచేసినట్లయితే దోషం సరిదిద్దబడుతుంది. వారి సమస్య కూడా క్రమంగా పరిష్కారమయ్యే సూచనలున్నాయి.



## ఉత్తరం వైపు పెంచుకోవచ్చా?

**సికె, కొత్తకోట**

**ప్రశ్న: ఆగ్నేయంలో ప్రహరికి ఆనించి మెట్లు, ఉత్తరం ప్రహరికి ఆనించి బాత్ రూమ్, లెట్రిన్ ఉన్నాయి. వాయువ్యంలో గడప ఉన్నది. మేం ఉత్తరం పెంచుకోవాలని అనుకుంటున్నాం. వాస్తురీత్యా ఏ విధంగా చేయాలి? తెలుపగలరు.**

**జవాబు:** బాత్‌రూమ్స్ ఏవీ కూడా నిర్మించకూడదు. ఆవరణలోని వాయువ్యం మూత వేయకూడదు. ఇంటిని ఉత్తరం పెంచి కట్టవలసి వస్తే అనేక విధాల జాగ్రత్తలు అవసరం. ముఖ్యంగా ప్రస్తుతం ఉన్న గృహం ఏ విధమైన నిర్మాణమో, పెంపుదల కూడా అదే విధమైన నిర్మాణమై ఉండాలి. పెంకుటింటిని రేకుల షెడ్డుతో పెంచకూడదు. అలాగే కుడ్య నిర్మిత గృహానికి పిల్లర్స్‌తో పెంపుదల చేయకూడదు. గృహాన్ని పెంచి కట్టినప్పటికీ ఏ విధమైన వాస్తు నియమోల్లంఘన జరగకూడదు. అందుకని ఇటువంటి పనులు వాస్తు నిపుణుల పర్యవేక్షణలో గావించుకోవటం ఉత్తమం.

## వీధిపోటు ఉన్నదా?

**ఎన్.విశ్వేశ్వరయ్య, నంద్యాల**

**ప్రశ్న: ఈ ఇంటికి వీధిపోటు ఉన్నదా? ఇందులో ఏమైనా వాస్తుదోషాలు ఉన్నాయా? కింద మెడికల్ షాపు ఉంది. పైన మా నివాసం. మాకు రెండు ప్లానుల వివరాలు తెలుపగలరు.**

**జవాబు:** 1) తూర్పు, పడమరలు వీధులున్న స్థలానికి/గృహానికి పశ్చిమ వాయువ్య 'వీధిచూపు' ఉన్నది. అనుకూల ఫలితాలు కలిగే అవకాశాలు ఎక్కువ. పబ్లిక్ రిలేషన్స్, రాజకీయ లబ్ధిని కలిగించే ఫలితాలు ఆశించవచ్చు.

2) ఈ స్థలం తూర్పు ఈశాన్యంతో బాటు పశ్చిమ నైరుతి పెరిగి 'డైమండ్' ఆకారంలో ఉన్నది. ఈ స్థలంలో గృహ నిర్మాణం యోగ్యం కాదు. పెరిగిన పశ్చిమ నైరుతిని మూలమట్టానికి సవరించగా మిగిలిన స్థలంలో గృహ నిర్మాణం గావించుకోవచ్చు. వైశాల్యాన్ని బట్టి ఫల భాగంలో హెచ్చుతగ్గులుంటాయి. వాస్తు నిపుణుల పర్యవేక్షణలో ఈ స్థల స్వరూపాన్ని సరిదిద్దుకోవటం మంచిది.

వాస్తు విద్వాన్ డా॥ దంతూరి పండరినాథ్ పాఠకుల సమస్యలకు ఆదివారం 'వాస్తువార్త'లో సమాధానాలిస్తారు. ఈ కింది కూపన్ జతచేసి సమస్యలు పంపవలసిన చిరునామా:
సాయిశ్రీ వాస్తు కన్సల్టెన్సీ, 3-2-4, కింగ్స్‌వే, రాష్ట్రపతి రోడ్, సికిందరాబాద్-3

వాస్తువార్త

పూర్తి పేరు : ..............................................
పుట్టిన తేది : ..............................................
జన్మ నక్షత్రం: ................తల్లి పేరు: .................
చిరునామా:.................................................

# సంగీతమే పరమ ఔషధం

మంత్రాలకు చింతకాయలు రాలేనా
రాగాలకు రోగాలు నయమయ్యేనా?
మంత్రాల మాటేమిటోగానీ సంగీతం
మాత్రం మానసిక రోగానికి మందు సుమా!
సంగీతమే ఒక జీవాత్మ,
అదే పరమాత్మ
దేవుని చేరే దివ్యమార్గం.
సంగీతం ఒక భోగం,
అనాది జీవనవేదం.
ఆందోళన, ఒత్తిడి, దిగులు
సంగీతంతో మటుమాయం.
అదొక దివ్య ఔషధం.
గొంతెత్తి పాడితే
పోయేదేముంది.. రోగం తప్ప.



సంగీతాన్ని ఆలకించడం ఒక భోగం,
ఆలపించడం ఒక యోగం,
ఉపేక్షించడం ఒక రోగం అన్నారు.
సంగీతం ఒక గంధర్వ విద్య.
వేరు వేరు ధ్వని ప్రకంపనలతో మెదడు
తరంగాలను నియంత్రిస్తే మనసుకు
ప్రశాంతమైన ధ్యానస్థితి కలగడం నిజం.
సుస్తీ చేస్తే నయం చేసుకోవడం
ఈ దేహానికి తెలుసు..
సంగీత ఔషధంతో.
అందుకే స్వరాలు ఔషధాలుగా రాగాలతో
మహిమాన్వితంగా చిరంజీవులై జీవిద్దాం.

– డా॥ పులివర్తి కృష్ణమూర్తి

# పేగు బంధం

నా కంటికి రెప్ప అమ్మ
కరుణ కుమ్మరించే దైవం
నిష్కల్మష ప్రేమకు ప్రతిరూపం
తెగిన బొడ్డు పేగు బంధం !
ఉదయ కిరణాలు సోకగానే..



మొగ్గలు వికసించి పువ్వులు
అమ్మ స్పర్శ తగలగానే..
శిశువు ముఖంలో నవ్వుల పువ్వులు!
ఆకలిని తరిమే అక్షయపాత్ర
సుఖ సంతోషాల్ని కోరే దేవత
ప్రత్యామ్నాయం లేని పాత్ర
నన్ను వీడని శ్రేయో గొడుగు!
అమ్మంటే ఆది దైవం
ఆమె హస్తం స్పర్శ ఓ ఔషధం
అమ్మ చేతి వంట అమృతం
తల్లి తపన సంతాన సౌఖ్యం!
అమ్మ ఒడి దేవిని గుడి
పలుకులు నేర్పే తొలి బడి
దెబ్బ తగిలి రక్తం కారితే..
అమ్మ కంట నీటి వరద!
అమ్మ మాటల తీపి ఊట
సుస్వర సంగీత జోల పాట
స్వచ్ఛ పాల నురగల తేట
రక్షణ కల్పించే అభేద్య కోట !
ప్రేమానురాగాల నెలవు
ఆకలి ఎరిగిన ఆదరువు
క్షేమాన్ని కాంక్షించే తావు
లేదెపుడు వాత్సల్య కరువు!

– మధుపాళీ

# ఆవిష్కరణ

నీ మస్తిష్కంలో మెరిసిన ఆలోచన
నీతోనే అంతం అయిపోవాలా?
జీవన రహదారిలో
నీవు వేసిన
గుర్తులు కాలం అనే
గాలిలో ఎగిరిపోవాలా?
నీ భావాలు, చేతలు కాలమనే
మాయపొరలో కలసిపోవాలా?
జీవితం అనే చరిత్ర పుటలో
నిన్ను నీవు
మిగుల్చుకోవాలనుకుంటే
నిన్ను నీవు అక్షర రూపంలో..
ఆవిష్కరించుకో
భావితరాలకు అది ఒక పాఠం!

– కంచనపల్లి వేంకట కృష్ణారావు

# విచిత్రమైన ప్రేమ కథలు

చిత్రమైన కథలు
విచిత్రమైన ప్రేమ కథలు
ఆరంభం ఎక్కడో..
అంతం ఎక్కడో..
గమ్యమేమిటో
తనకు అర్థంకాలేదు
నాకు అర్థం కాలేదు
ఈ వెలుతురుతో పాటు
నిప్పు రగులుకుంటోంది
పొగ కూడా పరుచుకుంటోంది
ఈ సప్నాన్ని నా కనులు
ఆవిష్కరిస్తూనే ఉన్నాయి
నిజానికి నేను కలల
ప్రపంచంలోనే జీవిస్తున్నాను
ఒక కొత్త ప్రపంచంలో
అడుగుపెట్టావు నీవు..
కొత్త ప్రేమ ప్రపంచాన్ని
నిర్మించుకున్నావు నీవు
ప్రతి సంధ్యా సమయంలో
నాకు గుర్తుకు వస్తావు నీవు
హృదయపూర్వక అభినందనలు నీకు!
ఒకరి జీవితంలో వజ్రంలా
ప్రకాశిస్తూ నీవు
ఒకరికి చాలా
సమీపంగా ఉన్నావు నీవు
అందరికీ అందనంత
చాలా దూరంలో నీవు.

– అరుణ డేనియల్

# పిఠాపురం చరిత్ర

తాను పుట్టిన ఊరు పిఠాపురానికి, ర్యాలి ప్రసాద్ యిచ్చిన గొప్ప బహుమతి 'పిఠాపురం చరిత్ర' అన్నారు ఆచార్య సినారె. పిఠాపురం సర్వస్వానికి యిది నిఘంటువు అన్నారు డా॥ రావూరి భరద్వాజ. ర్యాలి ప్రసాద్ 340 పేజీల ఈ ఉద్గ్రంథం, పిఠాపురం ప్రాంతానికి ఆంధ్ర పౌరాణిక, చారిత్రక, రాజకీయ, సాహిత్య, కళా సాంస్కృతిక రంగాల అనుబంధం దృష్ట్యా ఎంతో ప్రాధాన్యత కలిగివుంది. ఈ గ్రంథంలో 24 అధ్యాయాలలో రచయిత ప్రసాద్, గోదావరి నదికి ఉత్తర ప్రాంతమైన కళింగ రాజ్యం నాటి ప్రాచీనత నుంచి, ఆధునికత వరకు ఎంతో పరిశోధనాత్మకంగా, చరిత్రకు అందిన, నిక్షిప్తమైన వెన్నెల వెలుగులను ప్రసరింపచేసారు. కళింగ రాజ్యాన్ని పాలించిన రాజ్యాధీశులు, బౌద్ధ, జైన, హైందవ మతాల ప్రాభవం, ఎందరో సామంత రాజులు, సంస్థానాధీశులు, జమీందారులు, నాడూ నేడూ వివిధ రంగాల ప్రముఖుల జీవిత ప్రస్తావనలు పేరుపేరున సమగ్రంగా పేర్కొన్నారు. గోదావరి జిల్లాలోని కాలగర్భంలోని క్రీ.పూ. శతాబ్దాల, శాసనాధారితంగాను, గ్రంథాలలోని అమూల్య సారాంశాన్ని ఫొటోలు సేకరించి గ్రంథస్థం చేయటం అసాధరణ ప్రజ్ఞ, కార్యదీక్షా తత్పరత వుంటేనే సాధ్యమవుతుంది. పుట్టి పెరిగిన ఊరు, ఇల్లు, తల్లిదండ్రులపై కాలానుగుణంగా చెదిరి, కరిగిపోని ప్రగాఢ ఆత్మీయతా అనుబంధ తాదాత్మ్యత ఉంటేనే పిఠాపురం చరిత్ర వంటి గ్రంథాలు రాయగలరని ఈ గ్రంథం స్పష్టం చేస్తోంది.



**(పిఠాపురం చరిత్ర–రచన: ర్యాలి ప్రసాద్; వెల:రూ.375/–; ప్రతులకు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, నవయుగ బుక్ హౌస్ అన్ని బ్రాంచీలు)**

పుస్తక సమీక్ష

# "అమ్మతోడు అరుణా" లాల లింగమూర్తి

18–22 యేళ్ల యువత ఈ పుస్తకం చదవాలని, పెళ్లికి ముందే వధూవరులకు కౌన్సెలింగ్ అవసరమని, కాలేజీ విద్యలో పెళ్లి, ఆ తర్వాత జీవితం మీద పాఠ్యాంశాలు ఉండాలని 'అమ్మతోడు అరుణా' రచనలో లాల లింగమూర్తి 'నా మాట'లో తన అభిప్రాయం వ్యక్తీకరించారు. 31 కవితలు చోటు చేసుకొన్న 114 పేజీల సంపుటిలో 'నా బుద్ధిలేనితనం' అంటూ తనను నిందించుకొంటూ 'మనాళ్ళె కొందరుంటారు అమానవీయులు' అంటూ, ప్రతీ కవితలో సత్యవతమ్మ 'బిగ్ బ్రదర్ ముఠా' తన వైవాహిక జీవితంలో చిచ్చు పెట్టిందని కుటుంబంలోని స్వజనులు అసూయ, కుళ్లు, మానసికంగా హింసించే కుట్రల కారణంగా తన అర్ధాంగి బతకలేదని, చదువరుల గుండెలు బరువెక్కె ఎలిజీ కవితలు సృష్టించారు. ఆమె పుట్టిన రోజు, తనతో పెళ్లిరోజు, ఆమె గిట్టినరోజు సున్నిత హృదయునిగా 'అమ్మతోడు అరుణా! వచ్చే జన్మలో ఈ తప్పులు చేయను! అంటూ వేదనతో శోకతప్త హృదయంతో పశ్చాత్తాపం ప్రకటించడం, గతజల సేతుబంధనం ప్రతీ పేజీలో దర్శనమిస్తుంది. ప్రతీ కవితకు అదే ముక్తాయింపు.



**(అమ్మతోడు అరుణా–రచన: లాల లింగమూర్తి; వెల:రూ.60/–; ప్రతులకు: చిట్టి పబ్లికేషన్స్, హైదరాబాద్)**

# 'సుధామ' అక్షర క్రీడా సృజన 'అష్టాక్షరి'

తెలుగు సాహితికి 'సుధామ' మేధ, మరొక ప్రయోగాత్మక అపురూప వినూత్న ఆవిష్కరణను సమర్పించింది. గళ్ల నుడికట్టు, అవధాన యితర ప్రక్రియలలోని, అక్షర క్రీడలు పాఠకుల ఆదరాభిమానాలను ఆకట్టుకొంటునట్టే 'సుధామ, సృజనాత్మక సృష్టి అష్టాక్షరి, 8 అక్షరాల్లో మంచి మాటలు కూర్చే ఈ ప్రక్రియ వాట్సాప్ గ్రూప్‌లో అసంఖ్యాక సాహితీ ప్రియులను అలరింపచేస్తోంది. 8 అక్షరాలలో, వందలాది భాషాభిమానులు, వంద రోజుల పాటు వాట్సప్ గ్రూప్‌లో కూర్చిన వందలాది మంచి మాటలలోంచి రోజుకొకరుగా వంద మంది గౌరవ అతిథులు ఎంపిక చేసిన మేటి కూర్పుల సహస్రం ఈ అష్టాక్షరి, వెయ్యి మంది మాటల సంకలనంగా తెలుగు సాహితీ సరస్వతికి కంఠాభరణంగా సుధామ సమర్పించడం, అక్షర క్రీడా సునిశిత భావుకతకు అద్దం పడుతోంది. ఈ వెయ్యి మంచి మాటల కూర్పులు, గౌరవ అతిథుల రేఖాచిత్ర సహిత చిరు పరిచయం, కూర్పరుల పేరూ, ఊర్లతోనగ్రంథ రూపేణా వెలువరించడం అభినందనీయం. పాఠశాలల్లో, గ్రంథాలయాలలో తెలుగు కనుమరుగవుతోందనే ఆందోళనకు 'అష్టాక్షరి' సాంత్వన అందిస్తోంది. ఈ అక్షర క్రీడను ఉబుసుపోక ఊసులాటగా కాకుండా, ఆటలోని అంతరార్థాన్ని, ఆంతర్యాన్ని అర్థం చేసుకొని ఉత్తమ హితోక్తుల కూర్పును నేర్పుతో సమకూర్చిన సాహితీవేత్తలు అందరూ క్రీడా విజేతలే.



**(అష్టాక్షరి(వెయ్యి మంచిమాటల సంకలనం)–అక్షరక్రీడ సృజన, నిర్వహణ: సుధామ; వెల: రూ.300/–; ప్రతులకు: ఎ.వెంకటరావ్(సుధామ), ఇ–107, రాజపుష్ప ఏట్రియా, గోల్డన్ మైల్ రోడ్, కోకాపేట, హైదరాబాద్–500 075)**

– జయసూర్య

# 1 మార్చి, 2026 నుండి 7 మార్చి, 2026 వరకు

## వారఫలం




శ్రీమతి ములుగు శివజ్యోతి, ప్రముఖ జ్యోతిష్యురాలు

నారాయణ నాయక్ కాంప్లెక్స్, 2వ అంతస్తు, గాంధీ జ్ఞానమందిర్ వెనుక, కోఠి, హైదరాబాద్-1

ఫోన్ : 98494 53449, 9440927795


### మేషం

ఈ వారం సంఘంలో కీర్తి ప్రతిష్టలు పెరుగుతాయి. కుటుంబ సభ్యులను కలిసి ఉల్లాసంగా గడుపుతారు. కీలక నిర్ణయాలలో జీవిత భాగస్వామి సలహాలు తీసుకుంటారు. మధ్యవర్తిద్వారా పెండింగ్ ఉన్న రిజిస్ట్రేషన్ పనులను సానుకూల పరచుకోగలుగుతారు. సాంకేతిక రంగంలోని వారికి అనుకూలంగా ఉంటుంది. మీలోని ఏకాగ్రత లోపిస్తున్నట్లుగా భావిస్తారు.

### వృషభం

ఈ వారం విందు, వినోదాలు, విహారయాత్రలతో కాలాన్ని గడుపుతారు. పెరుగుతున్న ధరలు, రాబడివంటి ఆర్థిక అంశాలు ఆలోచింపచేస్తాయి. సంతాన క్షేమాన్ని వారి అవసరాలను దృష్టిలో ఉంచుకొని కొంత ధనాన్ని వారి పేరు మీద పొదుపు చేస్తారు. వృత్తి, ఉద్యోగాల పరంగా మీ స్థాయి పెంపొందుతుంది. వ్యాపారస్తులకు లాభాలు రొటేషన్ల రూపంలో ఉంటాయి. వివాహాది శుభకార్య ప్రయత్నాలు అనుకూలిస్తాయి.

### మిథునం

ఈ వారం అనుకోని సమస్యలు ఎదురైనా అధిగమిస్తారు. వివాదాలకు కోపతాపాలకు దూరంగా వుండడం మంచిది. కుటుంబ సభ్యుల సహాయం అందుకుంటారు. పూర్వపు మిత్రులను కలిసి ఆనందంగా గడుపుతారు. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా వుంటాయి. గృహం కొనుగోలు యత్నాలు సాగిస్తారు. షేర్లు, క్రయవిక్రయాలలో లాభాలు పొందుతారు. దైవ దర్శనాలు చేసుకుంటారు.

### కర్కాటకం

ఈ వారం మీ కార్యాలయంలో మీ స్థాయి పెరుగుతుంది. బరువు బాధ్యతలు కూడా అదే స్థాయితో పెరుగుతాయి. సామాజిక న్యాయములు సంఘటనలు కొన్ని కార్య క్రమములకు ఇబ్బందిని కలిగిస్తాయి. ఎదుటివారి మనస్తత్వాలు అర్థం చేసుకోవడం కష్టంగా పరిణమిస్తుంది. మధ్యవర్తిత్వాలు రాయబారాలు, పంచాయితీలు ఎగ్రిమెంట్లు కొద్దిపాటి ఒడిదుడుకులతో సాగుతాయి.

### సింహం

ఈ వారం ఆర్థిక లావాదేవీలు ఆశాజనకంగా ఉంటాయి. కొత్త కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. సేవ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటారు. కుటుంబంలో ఏర్పడిన చికాకులు తొలగుతాయి. కుటుంబంలో శుభకార్యాల ప్రస్తావన ఉంటుంది. ఉద్యోగులకు ఇంక్రిమెంట్లు రాగలవు. రాజకీయ కళారంగాల వారికి ప్రోత్సాహకరంగా ఉంటుంది. ఆకస్మిక ధనలాభం. ప్రయత్నాలు ఫలిస్తాయి.

### కన్య

ఈ వారం అనుకున్న పనులలో జాప్యం జరిగినా చివరికి పూర్తి చేస్తారు. సెల్ఫ్ డ్రైవింగ్ విషయంలో జాగ్రత్తలు అవసరం. కష్టానికి తగ్గ ఫలితం దక్కుతుంది. కొన్ని మొండి బాకీలు వసూలవుతాయి. సభలు, సమావేశాలలో చురుకుగా పాల్గొంటారు. ఉద్యోగులకు కొంతవరకు అనుకూలంగా ఉంటుంది. వృత్తి, వ్యాపారాలు ప్రోత్సాహకరంగా సాగుతాయి. సున్నితమైన మనస్తత్వం కలిగిన వారితో కలిసి ఓ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.

### తుల

ఈ వారం వ్యవహారాలు అనుకూలంగా సాగుతాయి. కొత్త కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. నూతన ఉద్యోగా వకాశాలు లభిస్తాయి. సభలు, సమావేశాలలో పాల్గొంటారు. సన్నిహితులు సైతం శత్రువులు గా మారి మిమ్మల్ని అకారణమైన నిందలకు గురి చేస్తారు. నూతన వస్తు, వస్త్రాలు ఆభరణాలు కొనుగోలు చేస్తారు. ఉద్యోగులకు ఎదురైన ఆటంకాలు తొలగు తాయి. నిత్యం అష్టమూలికా తైలంతో దీపారాధన చేయండి.

### వృశ్చికం

ఈ వారం నూతన కార్యక్రమాలను అనుకున్న విధంగా ప్రారంభించగలుగుతారు. కాంట్రాక్టు వర్క్లు, ఆర్డర్స్ లాభదాయకంగా ఉంటాయి. వ్యక్తిగత అవసరాలకు, సదుపాయాలకు, కొత్త పెట్టుబడులకు, విహార యాత్రలకు ధనం అధికంగా ఖర్చు చేస్తారు. ప్రచురణకు సంబంధించిన వ్యాపారస్తులకు అనుకూలంగా ఉంటుంది. ఆహార, ఆరోగ్య నియమాలను తు.చ. తప్పకుండా పాటించడం చెప్పదగినది. గృహం కొనుగోలు సానుకూలపడుతుంది.

### ధనస్సు

ఈ వారం చేపట్టిన పనులు నిదానంగా పూర్తి కాగలవు. దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారమవుతాయి. ఆర్థిక పరిస్థితి సంతృప్తికరంగా ఉన్నా కుటుంబ, ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయి. సహోద్యోగులతో అకారణంగా విరోధాలు ఏర్పడవచ్చు. అష్టమూలికా గుగ్గిలంతో ధూపం వేయటం శ్రేయస్కరం. షేర్లు, భూముల క్రయవిక్రయాలలో కొంత మెలకువ అవసరం. సంఘ సేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు.

### మకరం


ఈ వారం వృత్తి వ్యాపారాలకుగాను ప్రోత్సాహం లభిస్తుంది. న్యాయపరమైన చిక్కులలో చిక్కుకున్న మీ వారిని రక్షించవలసిన బాధ్యత మీపై పడుతుంది. కొన్ని పనుల విషయంలో ఓర్పు వహించుట చాలా అవసరము. పెట్టుబడులకు, పాత వస్తువుల మరమ్మత్తులు సంభవముగును. కనుమరుగైన వస్తువులు దొరికే సూచనలు ఉన్నాయి. ఆధ్యాత్మిక, వైజ్ఞానిక కార్యక్రమాలలో పాల్గొంటారు. ధనవ్యయం అధికంగా ఉంటుంది.తెలియజేసే విధంగా ఒక సంఘటన చోటు చేసుకుంటుంది.

### కుంభం


ఈ వారం ఓ సందర్భంలో మంచికి పోయి చెడ్డవారవుతారు. అనంతమైన కాలచక్రంలో కష్టసుఖాలు సర్వసాధారణమేనని భావిస్తారు. ప్రతికూల వాతావరణంలో అనుకూల ఫలితాలను సాధించడానికి అవిశ్రాంతంగా కృషి చేస్తారు. ఆర్థిక విషయాలలో ఎంత జాగ్రత్తలు తీసుకొనగలిగితే అంతమంచిది. వ్యాపార పరంగా పోటీని ఎదుర్కొంటారు. ఉద్యోగస్తులకు అనుకూలంగా ఉంటుంది. నిత్యం కాలభైరవాష్టకం పఠించడం చెప్పదగినది.

### మీనం


ఈ వారం మీ కార్యక్రమములకు, సంతానము యొక్క అభివృద్ధికి ఆటంకములను కల్పించే యత్నములు జరుగుతాయి. ముఖ్యముగా మీ ప్రతిష్ఠను దెబ్బతీసే యత్నములు అధికము కావచ్చును, కాని అవి ఫలించవు. ఆర్థికంగా లాభదాయకంగా ఉంటుంది. విందు, వినోదాలలో చురుకుగా పాల్గొంటారు. ఆత్మీయులు, శ్రేయోభిలాషులతో కలిసి ఆనందంగా గడుపుతారు. సర్ప రక్షా చూర్ణంతో స్నానమాచరించడం మంచిది.



నేను నిఖార్సయిన పార్టీ కార్యకర్తను..!
నా ఓటు నాకు కాకుండా పార్టీకే వేసాను!!

YOU TUBER

కరెంట్ ఎఫైర్స్ అంటే బూతు పాటలు, కోవా బన్నే అనుకున్నా..!!
TEA
EXAM


ఈ వారం కార్టూన్స్





టర్కీలోని
కప్పడోసియా
చారిత్రక, పర్యాటక
ప్రాంతం. ఇది హాట్
బెలూన్ రైడ్‌లకు
ప్రఖ్యాతి గాంచింది.







